ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | 5







నల్లజర్లలో బాబు



కొవ్వూరులో..



నల్లజర్లలో..



మన జెండా ఎగరాలి..

కొవ్వూరులో పోటీచేసేది చంద్రబాబే : ముప్పిడి



గత ఐదేళ్ల జగన్మోహనరెడ్డి విధ్వంసకర పాలనతో ప్రజలు విసుగుచెందారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉచిత ఇసుకను అందించాం. వైసీపీ నిబంధనలు తుంగలో తొక్కి గోదావరిలో ఇసుకను దోచుకుంటున్నారు. దీంతో గామన్ బ్రిడ్జిపై స్తంభం కుంగింది. డ్రెజ్జింగ్ వల్ల ఇసుక, పడవ కార్మికులు ఉపాధి దెబ్బ తింది. హోంమంత్రి కొవ్వూరులో ఓటమి భయంతో గోపాలపురం వెళ్లిపోయారు. కొవ్వూరులో పోటీచేసేది నేను కాదు.. మన చంద్రబాబే.



మీతోనే మేమంతా : కొవ్వూరులో విక్టరీ సింబల్ చూపుతున్న యువత



బాబును చూడాలని : డాబాలపైకి ఎక్కిన జనం



అదిరిన రోడ్ షో : కొవ్వూరులో రోడ్‌కు ఇరువైపులా జనం

గాలి మాటలు నమ్మొద్దు.. మీ సంక్షేమానికి నాది హామీ

- రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తు
- కూటమిని గెలిపించండి
- కొవ్వూరు అన్ని విధాలా అభివృద్ధి చేస్తా
- కొవ్వూరులో చెత్త గోపాలపురాన బంగారమా?
- ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేస్తా
- కొవ్వూరు, నల్లజర్లలో ప్రజాగళం సభల్లో చంద్రబాబునాయుడు

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/కొవ్వూరు/నల్లజర్ల, ఏప్రిల్ 4 : కొవ్వూరు, నల్లజర్ల జనసంద్రమయ్యాయి. ఎటుచూసిన జనమే.. ఇసుకేస్తే రాలనంతా జనం తరలి వచ్చారు.. ఉదయం నుంచి తమ నాయకుడు చంద్రబాబు ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూశారు. మహిళలు, యువకులు, పెద్దలు తారతమ్యం లేకుండా సభలకు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఇటు కొవ్వూరు పట్టణం.. అటు నల్లజర్ల జనంతో నిండిపోయాయి. కొవ్వూరు పట్టణంలోని దొమ్మేరు రోడ్‌లో మట్టే ప్రసాద్ రైస్‌మిల్లులో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లో 4.30 గంటలకు చంద్రబాబు దిగారు. అక్కడ నుంచి కార్లు, బైక్‌లపై కార్యకర్తలు, నాయకులు మెరకవీధి, బస్టాండ్ మీదుగా విజయవిహార్ సెంటర్ వరకు 2 కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రైతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ర్యాలీగా 5.20 గంటలకు విజయవిహార్ సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించారు. కొవ్వూరు పట్టణానికి ఎన్నోసార్లు వచ్చా. ఈసారి మాత్రం ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. ప్రజాగళం యాత్ర ద్వారా మీలో చైతన్యం తీసుకురావడానికి వచ్చిన నాకు ఆడబిడ్డలు, యువత, తమ్ముళ్లను చూస్తే ఏ మాత్రం అనుమానం లేదు. గెలుపు మనదే అన్నారు. గోదావరి పుష్కరాల్లో నేనే అభివృద్ధి చేశా. మళ్లీ హామీ ఇస్తున్నా కొవ్వూరు నా సొంత నియోజకవర్గంగా భావించి అభివృద్ధి చేస్తా. మీ బాధ్యత సౌమ్యుడు, న్యాయవాది, సేవ చేయడంలో దిట్ట అయిన కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వర రావు, రాజమహేంద్రవరం ఎంపీ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించండి. రాష్ట్రాన్ని కాపాడుకుందాం. అత్యధిక మెజార్టీ రావాలి. ఈ ఎన్నికలు ఏకపక్షంగా జరగాలని బాబు కోరారు. ఏ ఒక్కరైనా వైసీపీ తరపున పనిచేస్తే మనం కూర్చున్న కొమ్మను మనమే నరుకున్నట్టు అవుతుందన్నారు. పోలవరం నుంచి విజ్జేశ్వరం వరకు గోదావరిలో యంత్రాలతో డ్రెజ్జింగ్ చేసి ఇసుక తోడేయడంతో గామన్ వంతెన కుంగిపోయింది. హోంమంత్రిగా ఆమెకు అధికారాలు లేవుగాని, దోపిడీకి మాత్రం ఫుల్ అధికారాలు ఉన్నాయన్నారు. అత్యాచారాలపై ప్రశ్నిస్తే సాధారణంగా జరుగుతాయని బదులిచ్చిన హోంమంత్రి వనితకు ఆ పదవిలో కొనసాగే అర్హత ఉందా అని ప్రశ్నించారు. దొమ్మేరులో దళిత యువకుడిని అక్రమంగా అరెస్టు చేయడంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో దళితులు తిరగబడడంతో మంత్రి భయపడిపోయి పారిపోయిందన్నారు. కొవ్వూరులో చెత్త గోపాలపురంలో బంగారమా అన్నారు. ఇది న్యాయమా అన్నారు. జగన్మోహనరెడ్డి దీనికి సమాధానం చెప్పాలి. నీ హోంమంత్రి కొవ్వూరులో గెలవకపోతే నిన్ను ఎందుకు గెలిపించాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజల శ్రేయస్సు అవసరం లేదు. ధనార్జనే లక్ష్యం. అటువంటి దుర్మార్గుడు జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ప్రతి ఇంటిలో టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో కలిసి ముందుకు సాగాలి. ఈ రాష్ట్రం కోసమే ఈ పొత్తు అన్నారు. 2022 ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై న్యాయవాదులు గట్టిగా పోరాడుతున్నారు. ఆ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవడం మా ముగ్గురి బాధ్యత కాదు.. మనందరిదీ. కూటమిని గెలిపించండన్నారు. చంద్రబాబు నాయుడికి కొవ్వూరు నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు ఘన స్వాగతం పలికారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు నాగలి, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి గద బహూకరించారు. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడికి చంద్రబాబు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల జంక్షనులో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. జగన్ ఎంతో మోసం చేసి ఏమీ తెలియనట్టు నంగనాచిగా మాట్లాడతాడు. ముందు సిద్ధమన్నాడు. హోర్డింగులు పెట్టాడు. ఒక్కొక్క మీటింగుకు 1500 బస్సులు. ఈ రాష్ట్రం వీళ్ల తాత జాగీరా? గోపాలపురం నుంచే పోలవరం కాలువ పోతోంది. ఈ పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఒక వరం వంటిది. దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టు. 50 లక్షల క్యూసెక్కుల నీళ్లు. ఆ ప్రాజెక్టు ప్రమాదంలో పడితే తూర్పు, పశ్చిమ గోదావరి చాలా భయంకరంగా తయారయ్యే పరిస్థితి వస్తుంది. ఇప్పుడు పోలవరాన్ని జగన్ నాశనం చేశాడు. జగన్ స్వార్థానికి, అవినీతికి పోలవరం బలైపోయింది. నిప్పులాగా బ్రతికాం. జగన్ రాజకీయ కక్షతో బురద వేయడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆకాశంపై ఉమ్మి వేయడానికి చూస్తే అది ఆయన ముఖాన్నే పడుతుందన్నారు. ఎస్సీలకు నేను తీసుకొచ్చిన 27 పథకాల అమలు ఆపేశాడు. నా ఎస్సీలని అంటున్నావ్.. వాళ్లకు మేలు ఏం చేశావని అడుగుతున్నాం. జగన్ దళితులకు ఒక్క కార్యక్రమం కూడా చేయకుండా ద్రోహం చేశాడు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి సైకో. తూర్పుగోదావరిలో ఒక దళిత డ్రైవరును వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చంపి డోర్ డెలివరీ చేశాడా లేదా?.. మాస్కు అడిగిన పాపానికి విశాఖలోని డాక్టర్ సుధాకర్‌ని పిచ్చివాడిని చేసి చంపేశారు. సీతానగరంలో ఇసుక దోపిడీపై ప్రశ్నిస్తే శిరోముండనం చేయించారు. ఎస్సీలను చంపిన వాళ్లను పక్కన పెట్టుకుని ఊరేగుతావా?. అందుకే రంపచోడవరంలో ఆ ఎమ్మెల్సీ వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయబోతే ఎస్సీ కుర్రాళ్లు వచ్చి ఉరికెత్తించారు, తరిమి తరిమి కొట్టారు. అతడిని ప్రోత్సహించింది జగన్. వైసీపీని పాతిపెట్టాలి. ఆ పార్టీని నామ రూపాలు లేకుండా చేసే బాధ్యత మీదే. ఆంధ్రప్రదేశ్ ఆదర్శం కావాలని ఉంది. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచనతోనే మూడు పార్టీలు కలిసి పొత్తు పెట్టుకున్నాం. మమ్మల్ని అర్థం చేసుకొని ఆశీర్వదించండి. నష్ట పోయిన నా తెలుగు జాతిని ఆదుకోవడమే నా ఆలోచన. నాకు వేరే కోరికలేమీ లేవు' అని చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగరాజు, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళీ, గన్ని వీరాంజనేయులు, బొరగం శ్రీను, పితాని సత్యనారాయణ, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సుర్ధరాజు,బీజేపీ కన్వీనర్ మైనం వాసు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టి.వి.రామారావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వర రావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, నాదెళ్ల శ్రీరామ్, జి.వి. ప్రసాద్, పరిమి రాధ, బీవీ.ము త్యాలరావు, కాక్లర తులసి, అంద్రు అనిల్, గన్ని హరికృష్ణ, కరుటూరి ధనంజయ్, షేక్ మీరా సాహెబ్, యద్దనపూడి బ్రహ్మారాజు, పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాసరావు, జమ్ముల సతీష్, గంటా శ్రీను, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో మాట్లాడుతున్న ముప్పిడి.. చిత్రంలో అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు



నల్లజర్లలోనే రాత్రి బస

నారా చంద్రబాబు నాయుడు నల్లజర్లలోనే రాత్రి బస చేశారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్ హాల్‌కి వెళ్లారు. శుక్రవారం ఉదయం ప్రముఖులతో కాన్ఫరెన్స్, సమావేశాలు నిర్వహిస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు నల్లజర్లలోనే ఉంటారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు నల్లజర్ల హెలిపాడ్ నుంచి హెలికాప్టర్‌లో నరసాపురం బయలుదేరివెళతారు.

బాపిరాజుతో మాట్లాడతా..

జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుతో నేను స్వయంగా మాట్లాడతా.. మీరంతా కలిసి కట్టుగా పని చేసి పార్టీని గెలిపించాలి. 2009లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థిగా 2014లో జడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించా.. బాపిరాజు పార్టీ కోసం బాగా పని చేశాడు. శుక్రవారం మాట్లాడి సమన్వయం చేస్తా. అందరూ కలసి సైకో జగన్‌ను ఓడించి ఫ్యాన్‌ను చిత్తు చిత్తు చేసి డస్ట్‌బిన్‌లో పడేయాలి.



టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీపీని ఆహ్వానిస్తున్న బాబు

రాజకీయ ఓనమాలు నేర్పింది చంద్రబాబే : మద్దిపాటి

అతిసామాన్యమైన దళిత కుటుంబం నుంచి వచ్చా.. చంద్రబాబు రాజకీయ ఓనమాలు నేర్పించి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. చదువుకున్న దళిత యువకులను ప్రోత్సహించి సముచిత స్థానం కల్పించాలని ఆరాటపడే వ్యక్తి చంద్రబాబు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే చంద్రబాబుకు మనమంతా అండగా ఉందాం. సూపర్ సిక్స్ ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. 74 ఏళ్ల వయస్సులో మండే ఎండలను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసం తపించే చంద్రబాబు కోసం మనం ఒక అడుగు ముందుకు వేయాలి. కూటమిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.



గోపాలపురంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకటరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత చిత్రంలో జేసీ, డీఆర్‌వో తదితరులు

సమన్వయంతో పనిచేద్దాం

జిల్లా విభజన ద్వితీయ వార్షికోత్సవంలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4: తూర్పుగోదావరి జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకువెళ్లడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత అన్నారు. జిల్లా విభజన జరిగి రెండేళ్లు పూర్తిచేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో కేక్ కట్ చేశారు. గత రెండేళ్లుగా తనతో పాటు కలిసి పనిచేసిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. కొత్తగా జిల్లా ఏర్పడినప్పుడు మౌలిక సదుపాయాలు, మానవ వనరులు తదితర సమస్యలు ఉన్నా దశల వారీగా వాటిని అధిగమిస్తూ చక్కటి ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా సమన్వయం సాధించడం అత్యంత కీలకమన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు ఇదే విధమైన స్ఫూర్తితో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ చక్కని మార్గదర్శకం ఉంటే జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకొని వెళ్లడం సాధ్యమవుతుందనడానికి కలెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో సాధిస్తున్న పనితీరే నిదర్శనమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు జిల్లాలో బంగారు కొండ అనే కార్యక్రమం వినూత్న ఆలోచనలకు సృజనాత్మకత జోడించి విజయవంతంగా చేపట్టామన్నారు.కార్యక్రమంలో డీఆర్‌వో జి.నరసింహులు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

టీడీపీ అధినేత చంద్రబాబు

నేడు అసంతృప్తి నేతలతో చర్చ

రాజమహేంద్రవరం, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి) : రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటు పురందేశ్వరితో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలను ప్రజలు గెలిపించాలని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. కొవ్వూరులో గురువారం జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. జిల్లా లోక్‌సభ స్థానం బీజేపీ పొత్తులో భాగంగా వెళ్లిందని, రాజానగరం, నిడదవోలు జనసేన పోటీ చేస్తున్నాయన్నారు. మిగిలిన ఐదు స్థానాల్లో అనపర్తి బీజేపీకి ఇచ్చాం.ఇంకా డిసైడ్ కాలేదన్నారు. మిగతా చోట్ల టీడీపీ పోటీ చేస్తుందని కూటమి అభ్యర్థులందరినీ గెలిపించాలని కోరారు. అనపర్తి సీటు కోసం మాజీ ఎమ్మెల్యే నల్లమల్లి రామకృష్ణారెడ్డి పట్టుబట్టడం తెలిసిందే. టీడీపీ మొదటి జాబితాలోనే ఆయన పేరును ఖరారు చేసింది. బీజేపీతో పొత్తు కుదిరాక బీజేపీ అనపర్తి అభ్యర్థిగా శివరామకృష్ణంరాజు పేరు ఖరారు చేసింది. దీంతో రామకృష్ణరెడ్డి ప్రజల్లోకి వెళ్లడంతో ఇక్కడ పునరాలోన చేస్తున్నారు. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుంది. ఇక నల్లజర్లలో శుక్రవారం ఉదయం అసంతృప్తి నేతలతో చంద్రబాబు మాట్లాడే అవకాశం ఉంది.

పెళ్లింట విషాదం

రెప్పపాటులో ప్రమాదం.. ముగ్గురు మృతి

అప్పటి వరకూ ఎంతో ఆనందంగా గడిపారు.. నవదంపతులను నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు.. అనంతరం పెళ్లి కబుర్లు చెప్పుకుంటూ 11 మంది తాము వచ్చిన టాటా ఏస్ వాహనంలోనే వెనుతిరిగి ఇళ్లకు బయలుదేరారు.. రాత్రి పొద్దు పోయే వరకూ పెళ్లి ముచ్చట్లే.. మాట్లాడుతూ.. మాట్లాడుతూ... పెళ్లి జ్ఞాపకాలతో ఎవరికి వారు నిద్రలోకి జారుకున్నారు.. ఉదయానికి ఇల్లు చేరాలన్న కంగారులో డ్రైవర్ ఉన్నాడు.. ఒకే రోజులో వెళ్లి తిరిగి వచ్చే అలసటలో డ్రైవరూ రెప్పవాల్చాడు..మృత్యువు లారీ రూపంలో ఆగి ఉంది. ఆ లారీ కిందకు టాటా ఏస్ దూసుకుపోయింది.. ఆ రెప్పపాటులో ముగ్గురు జీవితాలు గాలిలో కలిసిపోయాయి.. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో పెళ్లింట తీవ్ర విషాదం నింపింది.. దీంతో ఆనందం ఆవిరైంది.. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో తండ్రీ కొడుకు పట్టుకుని మృతిచెందడం చూసి కన్నీటిపర్యంతమయ్యారు.. - వివరాలు7లో



మృత్యువులోనూ తండ్రి వెంటే.. మృతిచెందిన తండ్రీకొడుకు

నేటి నుంచి పురందేశ్వరి పర్యటన

- 8వ తేదీ వరకూ ఇక్కడే

- రేపు పార్టీ కార్యాలయం ప్రారంభం



రాజమహేంద్రవరం, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్ సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి శుక్ర వారం జిల్లాకు రానున్నారు.ఆమె 8వ తేదీ వరకూ జిల్లాలోనే ఉం టారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమల చేరుకుని అక్కడ వేంకటేశ్వరస్వామికి పూజ నిర్వహిస్తారు. 12 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుని వివిధ వర్గాలతో సమావేశమవుతారు. 6వ తేదీన ఉదయం 10.30 గంటలకు పార్లమెంటరీ పార్టీ ఆఫీసును ప్రారంభిస్తారు.ఏవీ అప్పారావు రోడ్డు చివరలో పాత ఎస్పీ ఆఫీసుకు ఎదురుగా 2014లో మాగంటి మురళీమోహన్ ఆఫీసుగా నిర్వహించిన భవనాన్నే పురందేశ్వరి తీసుకున్నారు. దీని ప్రారంభానికి అసెంబ్లీ అభ్యర్థులు, పార్టీ నాయకులు హాజరవుతారు. తర్వాత బీజేపీ కార్యకర్తలతో మాట్లాడతారు. 7వ తేదీన 10.30 గంటలకు రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. 4 గంటలకు రాజమహేంద్రవరం రూరల్ మీటింగ్, 8న ఉదయం 10.30 గంటలకు రాజానగరంలో రాజానగరం అసెంబ్లీ మీటింగ్, సాయంత్రం కొవ్వూరు నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తారు.

వైసీపీ వలయంలో వలంటీర్లు



- వైసీపీ కుట్రలో వలంటీర్లు సమిధలు
- వాళ్ల వేలితో వాళ్ల కన్నునే పొడిపించే కుట్ర
- ఐదేళ్ల నుంచీ 'సొంత' పనులకు
- ఎన్నికల వేళ 'కార్యకర్త'లుగా
- టీడీపీపై బురద జల్లే ప్రయత్నం
- తిరిగొచ్చి జగన్ ముఖంపై పడిన వైనం
- వలంటీర్లను దూరం పెట్టడం సబబేననే కోర్టు తీర్పుతో మళ్లీ ఛీ కొట్టించుకున్న పాలకులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జగన్ తన రాజకీయ కుట్రలో భాగంగా వలంటీర్లను సమిధలుగా వాడుకొంటున్నారు. వారి వేలితో వారి కంట్లోనే పొడుస్తున్నారు. తమకు అధికారం చిక్కితే యువతకు లక్షల ఉద్యోగాలు ఇచ్చేస్తామంటూ గత ఎన్నికల్లో జగన్ ఊదరగొట్టారు. తీరా అధికారం చేజిక్కించుకొన్న తర్వాత అవన్నీ 'గాలి' మాటలని తేలిపోయింది. లక్షల ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతకు ఝలక్ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీరు వ్యవస్థను తెచ్చారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం పీజీ చేసిన యువ తను సైతం 'వలంటీరు' పేరుతో పక్కదారి పట్టించారు. దీంతో యువత ఐదేళ్ల కాలాన్ని వృథా చేసు కొంది. తీరా ఎన్నికల వేళ కూడా వాళ్లను మానసికంగా ఇబ్బందులకు గురిచేసే కుతంత్రానికి తెరతీశారు. ఆ బురద అంతా టీడీపీపై నెట్టేయాలని ప్లాన్ వేశారు. కానీ న్యాయస్థానం తీర్పుతో ఆ బురద రివర్స్ వచ్చి 'ఫ్యాను'పైనే పడింది.

రాజీనామా డ్రామా

వలంటీర్లను ప్రభుత్వం ఇంకా నలిపేస్తోంది. ఉద్యోగాలకు రాజీనామాలు చేయించి పూర్తి స్థాయి కార్యకర్తలుగా వినియోగించుకునే దుష్టనీతికి తెరతీసింది. ప్రతి నియోజకవర్గంలో వైసీపీకి బాగా అనుకూలంగా ఉండే కొంతమంది వలంటీర్లతో రాజీ నామాలు చేయించి.. వారికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ అనధికారికంగా జీతం రూపేణా ముట్టజెప్పాలని వైసీపీ పెద్దలు ఇప్పటికే మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ కేవలం రూ.5 వేలు మాత్రమే జీతంగా.. కాదు.. గౌరవ భృతిగా చెల్లించారు. గౌరవ భృతి సరిపోక తాము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఈ ఐదేళ్లలో ఎన్నో సార్లు ప్రభుత్వానికి వలంటీర్లు మొరపెట్టుకున్నారు. అయినా వారి గోడును పట్టించుకున్న వైసీపీ నాయకులే లేరు. ఎన్నికల వేళ మాత్రం వలంటీర్లను నెత్తిన పెట్టుకుని చూసుకుంటున్నారు. దీంతో వైసీపీ నాయకుల రాజకీయ కుట్రలో సమిధలుగా మారిపోయారు. ఇప్పుడు మరో మోసానికి వైసీపీ తెరతీసింది. ప్రభుత్వంపై వలంటర్ల ఆగ్రహాన్ని అణగదొక్కడానికి ప్రలోభాలతో ఆశ పెడుతున్నారు.

టీడీపీపై నిందలా?

వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే లక్షలాది ఉద్యోగాలు కల్పించామని చెప్పుకోడానికి యువతను వలంటీరు పేరుతో మభ్య పెట్టింది. ఉన్నత చదువులు ఉన్న వారు సైతం మనసు చంపుకొని 'సేవ' చేస్తూ వచ్చారు. వలంటీర్లను ఎన్నికల వేళ మరింత అనుకూలంగా వాడుకోవాలని పన్నాగం వేసింది. ఇది గమనించిన ఎన్నికల సంఘం వలంటీర్లను ప్రభుత్వ పథకాల పంపిణీకి దూరం పెట్టింది. వలంటీర్లు తమ సొంత సైన్యమని జగన్, వలంటీర్లు వైసీపీ కోసమే పని చేయాలని వైసీపీ నాయకులు పదేపదే బహిరంగంగా ప్రకటించడం కూడా ఎన్నికల ప్రక్రియలో వలంటీర్లు లేకుండా చేసింది. ఇవేమీ వలంటీర్లు పసిగట్టకుండా ప్రభుత్వం రోజుకో నాటకం తెరపైకి తెస్తోంది. టీడీపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తోంది. వలంటీర్లను టీడీపీకి వ్యతిరేకం చేసి లబ్ధి పొందాలని చూస్తోంది. పింఛన్ల పంపిణీని సైతం ఆ కుట్రకు వాడుకొంది. పింఛన్ల పంపిణీలో వలంటీర్లు లేకపోతే తీవ్రమైన ఇబ్బందులు వస్తాయంటూ ప్రభుత్వం మొసలి కన్నీరు మొదలుపెట్టింది. ఓ వైపు అన్యాయమైన దారిలో నడుస్తూ న్యాయం కావాలంటూ తమకు అనుకూలమైన వారితో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయించడం ద్వారా కోర్టును ఆశ్రయించింది. ఈసీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరింది. కోర్టు కూడా ఈ అభ్యర్థనను తప్పు బట్టింది. వలంటీర్లు లేకుండా మిగతా రాష్ట్రాల్లో పింఛన్లు ఇవ్వడం లేదా? అని ఆక్షేపించింది. ఈసీ తరఫు న్యాయవాది వాదనతో ఏకీభవించింది. దీంతో జగన్ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లు అయ్యింది. తాను టీడీపీపై వేద్దామను కున్న బురద తిరిగొచ్చి తన ముఖంపైనే పడడంతో మిన్న కుండిపోయారు. వాస్తవానికి వలం టీర్లను టీడీపీ అధినేతగానీ, టీడీపీ నాయకులు గానీ కించపరిచిన, నిందించిన సందర్భాలు లేవు. వైసీపీ తమ రాజకీయ లబ్ధి కోసం యువతను వలంటీరు పేరుతో మోసం చేస్తోంది.

అసలుకే ఎసరు

వలంటీర్లను ఎన్నికల ప్రక్రియలో వినియోగించడానికి వీల్లేదని ఎన్నికల సంఘం ఉత్తర్వులివ్వడంతో వైసీపీ పెద్దలు కొత్త కుతంత్రానికి తెరతీశారు. ఇప్పటి వరకూ వలంటీర్లపై లేని ప్రేమ ఒక్కసారిగా తన్నుకొచ్చింది. ఓట్లు దండుకొనే కుట్రలో భాగంగా మమకారం ముంచుకొచ్చింది. వలంటీర్లను కొందరిని తొలగించి, మరికొందరితో రాజీనామాలు చేయించి వైసీపీ కార్యకర్తలుగా వాడుకోవాలనే దురుద్దేశాన్ని అమలు చేస్తోంది. ఐదేళ్ల నుంచీ వలంటీరు పరిధిలోని కుటుంబాలతో వారికి కొంత అనుబంధం ఏర్పడింది. వైసీపీ నాయకులకూ ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతో వలంటీర్లతో ఓటర్లకు ఉన్న అనుబంధాన్ని రాజకీయంగా వాడుకోవడానికి ప్లాన్ వేసింది. దీనిలో భాగంగా ఇన్నాళ్లూ పైసా జీతం పెంచడం చేతగాని పాలకులు ఇప్పుడు వలంటర్లతో రాజీనామాలు చేయించి వేల రూపాయలు ఆశ చూపుతున్నారు. వైసీపీ కోసం పని చేయాలంటూ అనధికార ఆదేశాలిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన మార్చి 16 తర్వాత నుంచీ వలంటీర్ల రాజీనామాలు ఆరంభమయ్యాయి. అంతకు ముందు వైసీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక వలంటీర్లు రాజీనామా చేసి వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు వందల్లో రాజీనామాలు చేస్తున్నారు. రాజీనామా లేఖల్లో కూడా టీడీపీపై ఆరోపణలు చేయాలని వైసీపీ నాయకులు చెప్పడంతో రాజీనామా లేఖలన్నీ అదే మాదిరిగా ఉండడం గమనార్హం. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వలంటీర్లను 'సేవ' నుంచి తొలగించారు. వైసీపీ నాయకుల గాలి మాటలకు తలొగ్గి కొందరు రాజీనామాలు చేస్తున్నారు. తర్వాత వీరి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీరు తమ ఉద్యోగం కోసం కోర్టులను ఆశ్రయించే అవకాశమూ లేదు. తమకు ఎలాగోలా పీడ వదిలిందని.. మరో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించుకుంటామని కొందరు వలంటీర్లు పరిచయస్తుల వద్ద ధీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



జిల్లాల వారీగా పరిస్థితి..

జిల్లాలో ఇప్పటివరకూ 174 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ 18, సీతానగరం 5, కడియం 87, దేవరపల్లి 8, రాజమహేంద్రవరం రూరల్ 9, తాళ్లపూడి 12, నల్లజర్ల 1, గోపాలపురం మండలం నుంచి 34 మంది తమ ఉద్యోగాలు వదులుకున్నారు. అయితే అందరూ విచిత్రంగా ఒకే కారణం చూపారని తెలుస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కారణంగా 26 మంది వలంటీర్లను ఉద్యోగాల నుంచి తొలగించారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 32 మంది రాజీనామా చేయగా 31 మందిని అధికారులు తొలగించారు. కాకినాడ జిల్లాలో ఇద్దరు రాజీనామా చేయగా 9 మందిని అధికారులు తొలగించారు. ప్రజాప్రతినిధులు నిబంధనలు పాటించకుండా వలంటీర్లను బలి చేశారు. ఆయా ప్రజా ప్రతినిధులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఉదాహరణకు రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ సమావేశం పెట్టి మరీ వైసీపీ కోసం పని చేయాలని వలంటీర్లను మౌఖికంగా ఆదేశించారు. వాస్తవానికి ఆ సమావేశానికి వెళ్లడానికి వలంటీర్లు నిరాకరించినా ఎంపీ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం.. అధికారులు వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమావేశానికి వెళ్లక తప్పలేదు. పాపం ప్రజాప్రతినిధి చేస్తే ఫలితం వలంటీర్లు అనుభవిస్తున్నారు. ఇలా మొదటి నుంచీ వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను వేధిస్తోంది.

లారీని ఢీకొన్న కారు



- అక్కడికక్కడే బావాబామ్మర్దుల దుర్మరణం
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



పల్లయ్యచౌదరి మృతదేహం



సుబ్బారావు మృతదేహం

గండేపల్లి, ఏప్రిల్ 4: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని తాళ్లూరు హోటల్ ముందు ఆగి ఉన్న లారీని షిఫ్ట్‌కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో బావాబామ్మర్దులు అక్కడికక్కడే మృతిచెందారు. అన్నవరం దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన తమ్మిన సుబ్బారావు(42), తెలంగాణ రంగారెడ్డి జిల్లా బాలానగర్‌కు చెందిన చేకూరి పల్లయ్యచౌదరి (53) కలిసి బుధవారం రాత్రి రాజమండ్రిలోని బంధువుల ఇంట వివాహానికి హాజరయ్యారు. అక్కడి నుంచి తెలిసిన బంధువు ఒకరు అన్నవరంలో ఉండడంతో గురువారం తెల్లవారుజామున అన్నవరం బయలుదేరారు. అన్నవరం సత్యనారాయణస్వామిని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. గండేపల్లి మండలం తాళ్లూరు వచ్చేసరికి సుమారు రెండుగంటలన్నర సమయమైంది. ఆ సమయంలో తాళ్లూరులోని హోటల్ ముందు లారీ డ్రైవర్ భోజనం కోసం లారీని పక్కన ఆపి భోజనం చేస్తున్న సమయంలో కారు అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. కారు సగభాగం లారీ కిందకి వెళ్లిపోయింది. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయినప్పటికీ అవి వారి ప్రాణాలను రక్షించలేకపోయాయి. దీంతో ఇరువురు కారులో లారీ కిందే చిక్కుకుపోయారు. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురై అక్కడికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని కారులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీయడానికి విశ్వప్రయత్నాలు చేశారు. కారు లారీ కిందకు వెళ్లిపోవడంతో బయటకు రాలేదు. జేసీబీ సాయంతో కారును బయటకు లాగి కారులో ఉన్న ఇద్దరిని బయటకు తీశారు. అప్పటికే ఇద్దరూ మృతి చెంది ఉన్నారు. దీంతో ఈవిషయాన్ని కుటుంబసభ్యులకు చేరవేయడంతో వారు సంఘటన స్థలానికి వచ్చి బోరున విలపించారు. ఎప్పుడూ అందరితో కలిసి ఉంటూ ఎవరికి ఏ కష్టమొచ్చిన ఆదుకునే వారిని మృత్యువు వెంటాడడాన్ని బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతదేహాలను పోలీసులు పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ సీసీ కెమెరాల ఆధారం బట్టి నిద్రమత్తులోనే ప్రమాదం జరిగి ఉండవచ్చన్నారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.

ఘోర ప్రమాదం

- పెందుర్తి వద్ద రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్
- ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- పెళ్లి వేడుక నుంచి వస్తుండగా ప్రమాదం
- మృతుల్లో తండ్రి,కొడుకు



అతికష్టం మీద బయటకు తీస్తున్న దృశ్యం



రోడ్డుపై క్షతగాత్రులు



ఆనందరావు



చంద్రశేఖర్



ఇందు

పెందుర్తి/తాళ్లపూడి, ఏప్రిల్ 4: విశాఖపట్నం జిల్లా పెందుర్తి సమీపంలో గల అక్కిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారి (నంబర్ 16)పై గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ నేతృత్వంలో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్ నుంచి క్షతగాత్రులను అత్యంత లాఘవంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామం నుంచి హనుమంతు ఆనందరావు, హనుమంతు చంద్రశేఖర్, చింతాడ ఇందు, అమ్మయ్యమ్మ, బొడ్డేపల్లి జ్యోతి, మెట్ట లక్ష్మి, వెంకటలక్ష్మి, నాగమణి, నీలవేణిలు బుధవారం ఉదయం మినీ వ్యాన్‌లో శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోగన్నపేట పంచాయతీ రంగానాథపేటలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం రాత్రి వివాహ వేడుక ముగిసిన తరువాత శ్రీకాకుళం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. వ్యాన్‌ను వినయ్ డ్రైవ్ చేస్తున్నాడు. పెందుర్తి బైపాస్ రోడ్డులో సరిపల్లి సమీపంలో అక్కిరెడ్డిపాలెం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో వ్యాన్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న హనుమంతు ఆనందరావు (45), హనుమంతు చంద్రశేఖర్ (17) చింతాడ ఇందు (58) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మిగతా వారికి తీవ్రగాయాలయ్యాయి. కాగా మృతుల్లో హనుమంతు ఆనందరావు (45), చంద్రశేఖర్ (17) తండ్రీకొడుకులు. వీరంతా దశాబ్దం కిందట పనుల కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ఉందని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు. ఆనందరావు కూలి పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా అతని కుమారుడు చంద్రశేఖర్ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు.

ద్రాక్షారామ ఈవోకు షోకాజ్ నోటీసు

ద్రాక్షారామ, ఏప్రిల్ 4: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం ఈవోకు ఎన్నికల నియమావళి సక్రమంగా పాటించడం లేదని రామచంద్రపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాసాగర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆలయ పరిసరాల్లో శిలాఫలకాలు మూసివేయకపోవడం, రాజకీయ పార్టీలకు పులిహోర పంపిణీ చేయడం, దేవస్థానం క్యాలెండరులో రాజకీయ నాయకుల ఫొటోలు ఉంచడం వంటి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించకపోవడంపై రిటర్నింగ్ అధికారి తీవ్ర హెచ్చరికలు జారీచేస్తూ నోటీసు అందిన 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదుపై పరిశీలన జరిపి ఈవోకు నోటీసులు జారీ చేశారు.

హోరాహోరీగా ప్రో కార్ట్ రేసింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి



విజేతలతో ఆదిత్య బృందం

గండేపల్లి, ఏప్రిల్ 4: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయస్థాయి ప్రో-కార్టింగ్ ఎండరెన్స్ చాంపియన్‌షిప్-2024 సీజన్-4 పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలను ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, చెన్నై, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కళాశాలల నుంచి 13 టీమ్‌లకు సంబంధించి 350 మంది సభ్యులు హాజరయ్యారు. కోకోకోలా, అల్టాయిర్, ఫ్లైమాస్టర్ కంపెనీల సంయుక్త సౌజన్యంతో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన పోటీల్లో మహారాష్ట్రకు చెందిన పీవీడీపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ట్రోజన్) టీమ్ విజేతగా నిలిచి రూ.లక్ష, ఎండురెన్స్ విన్నర్ రూ.85 వేలు నగదు బహుమతి సొంతం చేసుకుంది. రన్నరప్‌గా రఘు ఇంజనీరింగ్ కళాశాల(ఎనిగ్మాటీమ్) రూ.50 వేలు, ఎండురెన్స్ రన్నరప్ రూ.50 వేలు గెలుపొందింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మెకానికల్ విభాగం అధిపతికి, ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, స్పాన్సర్ కంపెనీల ప్రతినిధుల చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, కోఆర్డినేటర్లు డాక్టర్ శరవణన్, డాక్టర్ భీమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం కేసులో ముగ్గురి అరెస్టు

ముమ్మిడివరం, ఏప్రిల్ 4: మద్యం తరలిస్తున్న ఇద్దరిని, మద్యం అందించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కాట్రేనికోన మండలం కందికుప్ప మద్యం షాపు నుంచి కందికుప్పకు చెందిన పినపోతు ధర్మారావు, దొంతికుర్రుకు చెందిన కొమ్మాబత్తుల బాబాసాహెబ్‌అంబేద్కర్‌లు 223 మద్యం సీసాలను పల్లం తరలిస్తుండగా ఎస్ఈబీ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. షాపు సూపర్‌వైజర్, గ్రామస్థాయి ప్రజాప్రతినిధి కుమారుడు నాతి కవిరాజు మద్యం సీసాలు ఇచ్చినట్టు నిందితులు తెలిపారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ రామారావు తెలిపారు. కవిరాజును తప్పించేందుకు అధికార పార్టీకి చెందిన ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు ఎస్ఈబీ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చినట్టు సమాచారం.

18 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

తుని రూరల్, ఏప్రిల్ 4: గంజాయితో ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పోలీసులు 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో బ్యాగ్‌లో గంజాయి ప్యాకెట్లు నింపుకుని ఒడిసాకు చెందిన సంజిత్ లిమ్మ అనే వ్యక్తి సికింద్రాబాద్ వెళ్తున్నాడు. అయితే గంజాయి కొనుగోలు చేసే వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో లిమ్మ తుని రైల్వేస్టేషన్‌లో గంజాయితో పాటు దిగాడు. ఆ గంజాయిని తునిలో అమ్మడానికి ఎదురు చూస్తుండగా ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్ పరిశీలించగా 18 కిలోల 390 గ్రాముల గంజాయి, రూ.92 వేలు పట్టుబడింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు, రామకోటి, గణేష్, శంకర్రావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.గోవిందరావు, కానిస్టేబుల్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం

పండితులు, అధికారుల ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం



పందిరి రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 4: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకూ వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది యాత్రికులు తరలిరానున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఆర్డీవో సత్యనారాయణ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ స్వామివారి కల్యాణోత్సవాల ఏర్పాట్లపై ప్రణాళికను రూపొందించారు. గురువారం దివ్యకల్యాణ మహోత్సవానికి సంబంధించి పందిరిరాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ భూపతిరాజు కిషోర్‌కుమార్ పందిరిరాట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. 18 గురువారం స్వామివారి ధ్వజారోహణ, దర్శనములు, 19 ఏకాదశి శుక్రవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణం, 20 శనివారం స్వామివారి పొన్నవాహన మహోత్సవం, 21 ఆదివారం సదస్యం, 22 సోమవారం గౌతమి గోదావరి నదీలో తెప్పోత్సవం, 23 మంగళవారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, 24 బుధవారం స్వామివారి శ్రీపుష్ప మహోత్సవంతో స్వామివారి ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు 21న పరీక్ష

కాకినాడ రూరల్,ఏప్రిల్ 4: కాకినాడ జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు శంఖవరం, హంసవరంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు పనిచేస్తున్నాయో ఆ పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని 5వ తరగతి స్థాయిలో ప్రవేశ పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో ఉంటుందని తెలిపారు. దరఖాస్తు తేదీని ఈనెల 6 వరకూ పొడిగించామన్నారు. వివరాలకు 9491249321, 70329 96442లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటం



రాయవరం, ఏప్రిల్ 4: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన చిత్రకారుడు ఇడుంగమిల్లి సౌదాసాగర్ గీసిన జగ్జీవన్‌రామ్ చిత్రపటం ఆకట్టుకుంది. వివిధ రకాల రంగులతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చిత్రకారుడు తెలిపాడు.

కేసు తారుమారుపై విచారణకు ఆదేశం

గొల్లప్రోలు, ఏప్రిల్ 4: మద్యం స్థానంలో బీరు పెట్టి ఎస్ఈబీ పోలీసులు కేసు తారుమారు చేసిన వ్యవహారంపై విచారణకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గొల్లప్రోలులో ముగ్గురు వ్యక్తుల వద్ద మద్యం స్వాధీనం చేసుకుని ఆస్థానంలో బీరు సీసాలు ఉంచి ఒక్కరినే అరెస్టు చూపడంపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై ఐజీ ఆరా తీశారు. దీంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. దీంతో ఆమె విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

వృద్ధుల ఇంటికెళ్లి పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తాళ్లరేవు, ఏప్రిల్ 4: మండలంలోని 17 గ్రామ పంచాయతీ, సచివాలయాల్లో అధికారులు పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ప్రతీ పంచాయతీ, సచివాలయాల్లో సిబ్బంది 10 నుంచి 15 మంది దాకా ఉన్నా ప్రభుత్వం సానుభూతి పొందేందుకు పింఛన్లు ఇవ్వకుండా అనేక కథలు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం నుంచి మార్పు వచ్చింది. సచివాలయ ఉద్యోగులు ఉత్సాహంగా పనిచేసి వృద్ధులకు పింఛన్లు అందించారు. నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటికెళ్లి మరీ పింఛన్ అందించారు. చొల్లంగిలో ఉండ్రు నూకాలమ్మ అనే వృద్ధురాలు కుర్చీ సాయంతో వస్తుంటే వెల్ఫేర్ అసిస్టెంట్ హరిబాబు ఎదురెళ్లి పింఛన్ అందించారు. అలాగే యేసూరి సూర్యాకాంతం అనే వృద్ధురాలు మంచంపై లేవ లేని పరిస్థితిలో ఉండడంతో ఆమెకు వెల్ఫేర్ అసిస్టెంట్ దగ్గరకు ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు.

ఏజెన్సీ సమాచారం

'రంప' టీడీపీలో సమన్వయలోపం

విజయావకాశాలపై క్యాడర్ ఆందోళన

రంపచోడవరం, ఏప్రిల్ 4: రంపచోడవరం రిజర్వుడ్ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా గ్రూపు రాజకీయ కుమ్ములాటలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇక్కడ అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం చుట్టూనే ఇక్కడ వివాదం సాగుతోంది. అధిష్ఠానం నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఒక వర్గం అభ్యర్థి మిరియాల శిరీషను బలపరిచి నిలుస్తుండగా ఇందుకు వ్యతిరేకంగా మరికొన్ని గ్రూపులు నిలిచాయి. ఇక్కడ ఉన్న మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, వంతల రాజేశ్వరి తమకు అవకాశాన్ని ఇచ్చి తీరాలని కోరిన విషయం తెలిసిందే! అయితే మిరియాల శిరీషను అభ్యర్థిగా ఖరారు చేశాక రాజేశ్వరి, శీతంశెట్టి వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. చిన్నం బాబూరమేష్ టికెట్ ఆశిస్తూనే తటస్థంగా వ్యవహరిస్తున్నారు. కాగా ఇటీవల పరిణామాలు క్రమేపీ కుమ్ములాటలుగా మారిపోతున్నాయి. రంపచోడవరం అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం పునరాలోచించాలని కోరుతూనే, వంతలకు టికెట్ ఇవ్వకుంటే రాజీనామాలు చేస్తామని ఒక వర్గం అన్ని మండలాల నుంచి హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శిరీష వర్గం కూడా తీవ్రంగానే స్పందించింది. గతంలో అధిష్ఠాన నిర్ణయాలను గౌరవించిన సందర్భాలను గుర్తు చేస్తూ ఆరోపణలకు దిగింది. సామాజిక మాధ్యమాలను ఈ వర్గాలు వేదిక చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితులను గమనిస్తున్న సీనియర్లు, క్యాడర్ విజయావకాశాలపై ఆందోళన చెందుతున్నాయి. కేవలం పార్టీలో చోటు చేసుకున్న వర్గ పోరు, ఆధిపత్య పోరు, సమన్వయ లోపాలు ప్రత్యర్థి పార్టీలకు అనుకూలంగా మారతాయన్న ఆందోళన సర్వత్రావ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి తెలిసీ కూడా ఉమ్మడి జిల్లాలోని కీలక నేతలు సైతం పరిస్థితిని సరిచేయకపోవడం పట్ల కూడా క్యాడర్ అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది.

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి


ముగ్గులను తిలకిస్తున్న సబ్ కలెక్టర్

రంపచోడవరం ఏప్రిల్ 4: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నట్లు సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గురువారం ముగ్గుల పోటీల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేయాలని తహశీల్దారుకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, డీటీ బి.రాజు, ఐటీడీఏ పరిపాలనాధికారి డీఎస్వీ రమణ, సీడీపీవో సంధ్యారాణి, సీనియర్ అసిస్టెంట్లు చెల్లాయమ్మ, ఇందిరాభాయ్, వీఆర్వోలు గణపతి, పి.రవి, వి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఆనంద్, జి.ప్రభాకర్, జి.ఒసేపు, రమాదేవి పాల్గొన్నారు.

పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా పనిచేయాలి

కూనవరం,ఏప్రిల్4: రంపచోడవరం నియోజకవర్గంలో టీడీపీ ఎవరికి టిక్కెట్ ఇచ్చిన కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎంపీ సోడే రామయ్య అన్నారు. కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ రంపచోడవరం నియోజకవర్గానికి మిరియాల శిరీషను అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించిందన్నారు. చంద్రబాబునాయుడు అన్ని సర్వేలు చేయించి ఆమె పేరు ధృవీకరించారని కాని కొంతమంది వ్యతిరేకించడం సరైన నిర్ణయం కాదన్నారు. పార్టీ ప్రకటించాక ఎవరిని పేరు ప్రకటించిన కష్టపడి గెలిపించడం టీడీపీ కార్యకర్తల పని అని తెలిపారు. దీనిపై త్వరలోనే చంద్రబాబును కలుస్తానని నియోజకవర్గంలో ఉన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

నూకాలమ్మ తల్లి గరగలకు శుద్ధి

మోతుగూడెం, ఏప్రిల్4: చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం సీలేరు నదీ తీరాన నూకాలమ్మ తల్లి గరగలను శుద్ధి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ముందుగా నూకాలమ్మ తల్లి ఆలయంలో ప్రధాన అర్చకులు అయినవిల్లి కుమార్ స్వామి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి నూకాలమ్మ అమ్మవారిని గరగలతో మేళతాళాలతో నాటు డప్పులతో వాయిద్యాలతో ఊరేగింపుగా సీలేరు నదికి తీసుకువెళ్లి అక్కడ అమ్మవారికి గరగలకు నది వద్ద పుణ్య స్నానాలు చేయించి శుద్ధి చేసి నదీతీరాన తాటాకులతో మేడలు నిర్మించి అందులో గరగలు పెట్టి పూజించారు. అనంతరం ఐదు రోజులు పాటు ఈ గరగలను ఊరంతా తిప్పుతామని నూకాలమ్మ తల్లి జాతరలో భాగంగా ఈ గరగల ఊరేగింపు జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు కోంకోట చిట్టిబాబు, పెరుమళ్ళ దేవుడు, కోంకోట నూకరాజు, సన్యాసిరావు, కసిం శివ పాల్గొన్నారు.

సజావుగా పెన్షన్ల పంపిణీ

మోతుగూడెం, ఏప్రిల్4: చింతూరు మండలం మోతుగూడెం సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి రవినాయక్ ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కూడా పెన్షన్లు పంపిణీ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, దొర, అగ్రికల్చర్ అసిస్టెంట్ శరత్, పవర్, వీరు పెన్షన్లు పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం

వై.రామవరం, ఏప్రిల్ 4: మండలంలో గురువారం నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిరిజన గ్రామాల్లో వృద్ధులు, నడవలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించాలనే ఆదేశాలు ఉన్న కొన్ని సచివాలయాల పరిధిలో ఆ పరిస్థితి కనిపించలేదు. పింఛన్‌దారుల్లో ఎక్కువ మందికి వేలిముద్రల ఇబ్బందులు తలెత్తాయి. వేలిముద్రపడకపోవడంతో పింఛన్‌దారులకు వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లోకి ఎనరోల్‌మెంట్ అయిన తర్వాత కొందరికి పింఛన్లు ఇచ్చారు. మరికొందరికి వేలిముద్రలు పడక సొమ్ములు చేతికందక ఆవేదనకు గురయ్యారు. పలు సచివాలయాల పరిధిల్లో పింఛన్ల పంపిణీ ఎంపీడీవో రవికిషోర్ పర్యవేక్షించారు. గురువారం సాయంత్రానికి 60 శాతం పంపిణీ పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

బాపనమ్మ ఉత్సవాలు ప్రారంభం

రంపచోడవరం, ఏప్రిల్ 4: మండలంలోని సీతపల్లి గడి బాపనమ్మ జాతర ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిపే ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు.

ఉమ్మడి అభ్యర్థి ప్రచారం

రంపచోడవరం, ఏప్రిల్ 4: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి మిరియాల శిరీష గురువారం సిరిగిందలపాడులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

రంపచోడవరం, ఏప్రిల్ 4: వైఎస్ఆర్ ప్రభుత్వం ఏర్పడ్డాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని నర్సాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు పాలన తీసుకువచ్చామన్నారు. మండల, జేసీఎస్ కన్వీనర్లు, ఎంపీపీ, జడ్పీటీసీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

టీడీపీ నాయకుల పరామర్శ

ఎటపాక, ఏప్రిల్ 4: టీడీపీ సీనియర్ నాయకుడు యాసాని హరనాథ్ బాబు అనారోగ్యం బారిన పడి గురువారం మృతి చెందారు. ఈ మేరకు తోటపల్లిలో ఆయన మృతదేహాన్ని టీడీపీ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, టీపీవీడు సర్పంచ్ మోసం రాజులు, తోటపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లభనేని రమేష్, నాయకులు నలజాల ప్రసాద్, కొట్టే బాబు, నలజాల కోటి ఉన్నారు.

నేటి నుంచి మహాకాళేశ్వర ఆలయ వార్షిక వేడుకలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 4:రాజమహేంద్రవరం మహా కాళేశ్వరాలయం ద్వితీయ వార్షిక వేడుకలు శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తామని గౌతమి ఘాట్ ఆధాత్మిక సంస్థల సమాఖ్య అధ్య క్షుడు తోట సుబ్బారావు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, దీక్షాధారణ, రక్షా బంధనం, సాయంత్రం అమ్మవారికి కుంకు మార్చన, 6,7,8 తేదీల్లో స్వామి వారికి నిత్యాభిషేకాలు ఉంటాయన్నారు. ప్రతి రోజూ అన్నదానం జరుగుతుందన్నారు.

అధికారులంతా తటస్థంగా ఉండాలి

- వైసీపీకి వత్తాసు పలికితే ఈసీకి ఫిర్యాదు
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4: అధికారులంతా న్యూట్రల్‌గా ఉండాలని, వైసీపీకి వత్తాసు పలుకుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తూనే ఉంటామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య హక్కులు హరిస్తున్న, ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఎలక్షన్ కమిషన్‌ను కోరుతున్నామన్నారు. రాక్షస పాలన అంతానికి నూతన సంప్రదాయంతో కూడిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కూటమి ముందుకు వెళ్తుందన్నారు. జగన్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ముద్రగడ పద్మనాభం కాపులకు ఏమి న్యాయం చేశాడని జగన్ వద్దకు చేరాడో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో కేంద్రం 10శాతం రిజర్వేషన్లు ప్రతిపాదనలు కల్పిస్తే అందులో కాపులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే ఆటుపై అధికారంలోకి వచ్చిన జగన్ తో ఎందుకు నువ్వు ఆ రిజర్వేషన్లు సాధించలేకపోయావని ప్రశ్నించారు. ఎంపీగా పురందేశ్వరి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. జనసేన అధ్యక్షుడు చిన్నారావు, బీజేపీ నాయకుడు ఆకుల శ్రీధర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో పీవీసుబ్రహ్మణ్యం, నాగులపల్లి వీరబాబు, యానపు యేసు సుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఎంఎస్ఎస్ ప్రసాద్, వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, రొంపిచర్ల ఆంటోని పాల్గొన్నారు.

రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ

- ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు
- కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామికి పూజలు
- ఆపై కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం


కోరుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న గిడుగు రుద్రరాజు

కోరుకొండ, ఏప్రిల్ 4: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని, మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేదింటి మహిళకు ఏడాదికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందిస్తుందని ఇటువంటి 9 అద్భుతమైన సంక్షేమ పథకాలను అందజేస్తుందని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు, రాజమహేంద్రవరం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన పలువురు కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సరసన్న దేవస్థానం నుంచి ర్యాలీగా పంచాయతీ కార్యాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి మీదుగా నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను శుక్రవారం ఢిల్లీలో విడుదల చేస్తారని, పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక పింఛను నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు అందజేస్తుందన్నారు. రాష్ట్రంలో 2.50లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. దేశంలో బీజేపీ హిందూయేతర మతస్తులను ఇబ్బంది పెడుతోందని, మత సామరస్యం, సుస్థిర పాలన, కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముండ్రు వెంకట శ్రీనివాసు, కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణ, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోన వెంకట్, అనపర్తి అభ్యర్థి శ్రీనివాస్ వడియార్, నాయకులు, ఐవీ శేషగిరి, మార్టిన్ లూథర్, గరగ శ్రీధర్‌బాబు, కర్రి వీర గణేష్, అరుసమిల్లి రమేష్, దోనపాటి సత్యప్రసాద్, నల్ల వీర్రాజు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని కోటికేశవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ, టీడీపీ నాయకులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

టీడీపీతోనే నా ప్రయాణం

- ప్రకటన వచ్చే వరకు 'న్యాయం కోసం నల్లమిల్లి' కొనసాగింపు
- రాయవరం పర్యటన వాయిదా : రామకృష్ణారెడ్డి


రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న కొత్తపేట కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు

అనపర్తి, ఏప్రిల్ 4: తెలుగుదేశం పార్టీతోనే తన ప్రయాణమని అనపర్తి నుంచి పోటీలో నిలిచేది తానేనని, ప్రకటన వచ్చే వరకు న్యాయం కోసం నల్లమిల్లి కొనసాగిస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆళ్ల గోవిందు అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు కోనాల వెంకటరెడ్డి పది రోజులుగా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. పలు తీర్మానాలు చేశారు. అనంతరం రామవరంలోని నల్లమిల్లి నివాసానికి చేరుకుని తీర్మానంలోని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ అనపర్తిలో పార్టీని నిలుపుకోవాలని, కార్యకర్తలను రక్షించుకోవాలన్నదే తన లక్ష్యమ న్నారు. పార్టీ మార్పు ఆలోచన లేదని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల ప్రకారం అనపర్తి సీటును టీడీపీకే కేటాయిస్తారని, కార్యకర్తలు అధైర్య పడవద్దని అన్నారు. ఇదిలా ఉండగా ముందుగా ప్రకటించిన విధంగా శుక్రవారం నుంచి రాయవరంలో నిర్వహించనున్న న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమం పార్టీ పెద్దలు యనమల రామకృష్ణుడు, కూర్మాపురం అబ్బు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు సూచనల మేరకు వాయిదా వేసినట్టు నల్లమిల్లి తెలిపారు. కాగా కొత్తపేట కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు గురువారం రామకృష్ణారెడ్డిని కలిసి సంఘీభావం ప్రకటించారు. అనపర్తి సీటును చంద్రబాబు నల్లమిల్లికే కేటాయిస్తారన్న నమ్మకం ఉందని ఆయన అన్నారు.

హర్రర్ విత్ టెర్రర్ సినిమా షూటింగ్



రాజమహేంద్రవరంలో షూటింగ్ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4: ఇందిరాటి క్రియేషన్స్ పతాకంపై వంశీ రాజు దర్శకత్వంలో హర్రర్ విత్ టెర్రర్ సినిమా షూటింగ్ రాజమహేంద్రవరంలో జరుగుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వంశీరాజు మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లర్‌తో సాగే ఈ సినిమాలో ఐదుగురు అమ్మాయిలు ఎదుర్కొనే సమస్యలు, భయంకరమైన ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని హీరో ఎలా రక్షించాడు వంటి సన్నివేశాలు తెరకెక్కిస్తున్నామన్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా దినుష్య, వర్ధమాన హీరో నటిస్తుండగా నిర్మాతగా టి.రాజు వ్యవహరిస్తున్నారు. నటీనటులు అనూష, గీత, శృతి, లావణ్య, జబర్దస్త్ నటులు షేకింగ్ శేషు, కట్టప్ప, పొట్టి చిట్టిబాబు, వరహాలు, బాబూద్గారావు, టిక్‌టాక్ సూరిబాబు నటిస్తున్నారని తెలిపారు.

7న అండర్-17 చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 4: ఈ నెల 7వ తేదీన అండర్-17 బాలురు, బాలికలకు చదరంగం పోటీలు నిర్వహిస్తామని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జి.వి.కుమార్ తెలిపారు. ఈ పోటీలు గాంధీపురం శ్రీ గౌతమి స్మార్ట్ స్కూలులో జరుగుతాయని, క్రీడాకారులు తమ పేర్లను శనివారంలోపు ఏపీ చెస్ ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులు 1.1.2007 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే అండర్-17 రాష్ట్ర పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని కుమార్ చెప్పారు. వివరాలకు సెల్ 98483 74133 నెంబరులో సంప్రదించాలన్నారు.

వీరవరంలో రామలింగేశ్వరుడి రథోత్సవం



కడియం, ఏప్రిల్ 4: మండలంలోని వీరవరంలో శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీఉమ-రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా గురువారం రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. గ్రామస్థులు స్వామి వారి రథాన్ని లాగుతూ భక్తి పారవశ్యంలో మునిగారు. గ్రామ శివారు వరకు సాగిన ఈ రథోత్సవంలో ప్రజాప్రతినిధులు, భక్తులు, యువత పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4: రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. రాజమండ్రి రూరల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాలేపల్లి మురళీధర్ గురువారం సీపీఐ కార్యాలయానికి వచ్చారు. ఈ మేరకు జిల్లా, నగర పార్టీ తరపున సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పండి : వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4: దగా చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఓట్లతో బుద్ధిచెప్పాలని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు పిలుపునిచ్చారు. 22వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, టీడీపీ నగర కోశాధికారి శెట్టి జగదీష్, మాటూరి సిద్దులతో కలిసి గురువారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలని తెలుగు మహిళా నగర ధ్యక్షురాలు కోసూరి చండిప్రియ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ రావు, కొత్త రాజేష్, తక్కసల పూర్ణ, నల్లం ఆనంద్, గ్రంధి రాజా, తమ్మన గోపాలకృష్ణ, లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంపై గెస్ట్ లెక్చర్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4: రాజమహేంద్రవరం ప్రభుత్వ అర్ట్స్ కళాశాలలో గురువారం రసాయనశాస్త్ర విభాగంలో గెస్ట్ లెక్చర్ ఏర్పాటు చేశారు. రిటైర్డు ప్రధాన ఆచార్యుడు ఎన్‌వీ రామకృష్ణ రసాయనశాస్త్ర తిరోగమన సంశ్లేషణ విధానంపై వివరించారు. దేశంలోని యువ శాస్త్రవేత్తలు ప్రధానంగా ఔషధ పరిశ్రమ వైపు మక్కువ చూపుతున్న తరుణంలో రసాయన తిరోగమన సంశ్లేషణ విధానం ఆవలంబన, చర్యలపై మరింత ఆసక్తి పెరిగిందన్నారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాస్, రసాయనశాస్త్ర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'అన్నదాత'తో రైతుకు రూ.20 వేలు అందిస్తాం

గోకవరం, ఏప్రిల్4: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు అన్నదాత పథకం ద్వారా రూ.20,000 అందజేస్తామని టీడీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోడలు లక్ష్మీదేవి, ఆమె తన యుడు ఆనీష్ నెహ్రూ హామీ ఇచ్చారు. మండలంలోని వెదురుపాకలో గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథకర్త సుబ్బారావుకు వీసీ అభినందనలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 4: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, కొయ్యలమూడి రాధ రచించిన ది ఫిలాసఫీ ఆఫ్ అడ్జస్ట్‌మెంట్, యాంగ్జయిటీ అండ్ అకడమిక్ అచీవ్‌మెంట్ పుస్తకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సుబ్బారావు మాధ్యమిక పాఠశాలల్లోని విద్యార్థుల సర్దుబాటు వ్యాకులత, వార్షిక ప్రగతి ఏవిధంగా ఉంటుందో ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అకడమిక్ డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



రంగంపేట, ఏప్రిల్ 4: ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకొనేలా చైతన్యపరచాలని తహశీల్దార్ షెక్ లతీఫ్‌పాషా అన్నా రు. గురువారం రంగంపేట జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం పి.పార్థసారధి అధ్యక్షతన నిర్వహించిన ఎస్‌వీఈఈపీ(సీప్) కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కును వినియోగించుకునే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రలోభాలకు లొంగిపోకూడదని, సమాజానికి మంచి చేసే నాయకుడుని ఎన్నుకునే హక్కు ఓటర్లకు ఉందని చెప్పి గ్రామస్థులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.సి.జాకబ్, ఆర్.చార్లెస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి

రాజమహేంద్రవరం ఆర్‌వో దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4: మాస్టర్ ట్రైనీలు తమకు కేటాయించిన అంశాలపై అవగాహన తెచ్చుకుని పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని 50- రాజమహేంద్రవరం ఆర్‌వో దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం మాస్టర్ ట్రైనీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు మాక్‌పోల్ ఎలా నిర్వహించాలి, ఈవీఎంలు ఎలా సిద్ధం చేయాలి, ఎన్నికల నిర్వహణ రిపోర్టు ఫారాలు ఎలా నింపాలి, వాటిని ఏఏ ప్యాకెట్లలో పెట్టాలో శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ సమయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ల తప్పులను సరిదిద్దాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలన్నారు. ఈవీఎంలు వీవీ పాట్‌లు ఎలా ఉపయోగించాలో తెలియజేయాలని, ప్రతిఒక్కరికి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ల అనుసంధానం చేయడం నేర్పాలన్నారు. పూర్తిగా నేర్చుకుంటే పోలింగ్ జరిగే రోజు పొరపాట్లకు ఆస్కారం వుండదన్నారు. సమావేశంలో తహశీల్దార్ ఆంజనేయులు, సిటీ అసెంబ్లీ మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలి

గోకవరంలో రైతుల ఆందోళన.. తహశీల్దార్‌కు వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గోకవరం, ఏప్రిల్ 4: సన్నరకం (ఆర్ ఎస్ఆర్) పంటకు పూర్తి మద్దతు ధర ప్రకటించాలని కోరు తూ మండలంలోని పలువురు రైతులు గురువారం గోకవరంలో ఆందోళనకు దిగారు. పాతబస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై బైఠాయింపు, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు చింతల రామకృష్ణ మాట్లాడుతూ ఈ సీజన్‌లో మండలంలోని అధిక రైతులు ఆర్ఎస్ఆర్ రకం పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశామన్నారు. మిల్లర్లు కుమ్మక్కై ధాన్యం రేటు రూ.2 వేలు నుంచి రూ.1500కు కుదించి రైతుల నడ్డి విరిచారన్నారు. మార్కెట్లో ఆర్ఎస్ఆర్ బియ్యం 25 కిలోలు రూ.1650 ధర పలుకుతుండగా 75 కిలోల ధాన్యాన్ని మాత్రం రూ.1500కు కొనుగోలు చేయడం దారుణమని, ఈ విషయంలో అధికారులు కూడా పూర్తి నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం బాధిత రైతులు ర్యాలీగా రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకొని ఆర్ఎస్ఆర్ రకం ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. తదుపరి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో రైతులు గండికోటి శ్రీధర్, రాయవరపు అప్పారావు, అలబండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివకేశవుల కల్యాణోత్సవం

రాజానగరం, ఏప్రిల్ 4: పాల్గుణ బహుళ ఏకాదశి సందర్భంగా రాజానగరంలో శ్రీరాజలింగేశ్వర, శ్రీరాజగోపాల స్వామి కల్యాణోత్సవం గురువారం కన్నుల పండువుగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వైసీపీ కన్వీనర్ దూలం పెద్ద దంపతులు, స్థానిక వ్యాపారవేత్త డీవీబీ వసంతకుమార్ దంపతులు చేతుల మీదుగా ఆలయార్చకులు వైభవోపేతంగా కల్యాణం జరిపించారు. ఈవో రాంబాబురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ పీవోకు రామారావు అవార్డు


అవార్డు అందుకుంటున్న షేక్ మీరా


రాజానగరం, ఏప్రిల్ 4: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో, లైబ్రరీ ఆఫీసర్ షేక్ మీరాకు పడాల రామారావు స్మారక పురస్కారం లభించింది. స్వతంత్ర సమర యోధుడు, శతాధిక గ్రంథ కర్త, పడాల రామారావు 18వ స్మారకోత్సవం సందర్భంగా గోదావరి జిల్లా శాఖ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామిరెడ్డి, డాక్టర్ గంగిరెడ్డి చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రన్, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం మీరాను అభినందించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

విశ్వహిందూ పరిషత్ రామసేన వ్యవస్థాపకాధ్యక్షుడు కంబాల


సమావేశంలో మాట్లాడుతున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం, ఏప్రిల్ 4: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యపడుతుందని విశ్వ హిందూ పరిషత్ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ గురువారం గోకవరం చేరుకొని శ్రీనివాసరావును బీజేపీలోకి ఆహ్వానించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు ప్రకటించారు. హిందూ దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా తాను పని చేస్తున్నానన్నారు. ఇప్పటికీ ఆలయాల అభివృద్ధికి సుమారు రూ.2.50 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. అలాగే ఇబ్బందుల్లో ఉన్నవారికి ఆర్థిక సాయం అందిస్తున్నాట్టు చెప్పారు. కార్యక్రమంలో మట్టా మంగరాజు, దాట్ల కృష్ణవర్మ, సత్తి వెంకటరెడ్డి, ఇనగోటి బాపన్నదొర, బత్తుల వెంకన్నబాబు, కోన సురేష్ పాల్గొన్నారు.







నల్లజర్లలో బాబు



కొవ్వూరులో...



నల్లజర్లలో...



మన జెండా ఎగరాలి..

కొవ్వూరులో పోటీచేసేది చంద్రబాబే : ముప్పిడి



గత ఐదేళ్ల జగన్మోహనరెడ్డి విధ్వంసకర పాలనతో ప్రజలు విసుగుచెందారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉచిత ఇసుకను అందించాం. వైసీపీ నిబంధనలు తుంగలో తొక్కి గోదావరిలో ఇసుకను దోచుకుంటున్నారు. దీంతో గామన్ బ్రిడ్జిపై స్తంభం కుంగింది. డ్రెడ్జింగ్ వల్ల ఇసుక, పడవ కార్మికులు ఉపాధి దెబ్బ తింది. హోంమంత్రి కొవ్వూరులో ఓటమి భయంతో గోపాలపురం వెళ్లిపోయారు. కొవ్వూరులో పోటీచే సేది నేను కాదు.. మన చంద్రబాబే.



మీతోనే మేమంతా : కొవ్వూరులో విక్టరీ సింబల్ చూపుతున్న యువత



బాబును చూడాలని : డాబాలపైకి ఎక్కిన జనం



అదిరిన రోడ్ షో : కొవ్వూరులో రోడ్‌కు ఇరువైపులా జనం

గాలి మాటలు నమ్మొద్దు.. మీ సంక్షేమానికి నాది హామీ

- రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తు
- కూటమిని గెలిపించండి
- కొవ్వూరు అన్ని విధాలా అభివృద్ధి చేస్తా
- కొవ్వూరులో చెత్త గోపాలపురాన బంగారమా?
- ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేస్తా
- కొవ్వూరు, నల్లజర్లలో ప్రజాగళం సభల్లో చంద్రబాబునాయుడు

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/కొవ్వూరు/నల్లజర్ల, ఏప్రిల్ 4 : కొవ్వూరు, నల్లజర్ల జనసంద్రమయ్యాయి. ఎటుచూసిన జనమే.. ఇసుకేస్తే రాలనంతా జనం తరలి వచ్చారు.. ఉదయం నుంచి తమ నాయకుడు చంద్రబాబు ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూశారు. మహిళలు, యువకులు, పెద్దలు తారతమ్యం లేకుండా సభలకు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఇటు కొవ్వూరు పట్టణం.. అటు నల్లజర్ల జనంతో నిండిపోయాయి. కొవ్వూరు పట్టణంలోని దొమ్మేరు రోడ్‌లో మట్టే ప్రసాద్ రైస్‌మిల్లులో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లో 4.30 గంటలకు చంద్రబాబు దిగారు. అక్కడ నుంచి కార్లు, బైక్‌లపై కార్యకర్తలు, నాయకులు మెరకవీధి, బస్టాండ్ మీదుగా విజయవిహార్ సెంటర్ వరకు 2 కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రైతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ర్యాలీగా 5.20 గంటలకు విజయవిహార్ సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో ప్రసగించారు. కొవ్వూరు పట్టణానికి ఎన్నోసార్లు వచ్చా. ఈసారి మాత్రం ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. ప్రజాగళం యాత్ర ద్వారా మీలో చైతన్యం తీసుకురావడానికి వచ్చిన నాకు ఆడబిడ్డలు, యువత, తమ్ముళ్లను చూస్తే ఏ మాత్రం అనుమానం లేదు. గెలుపు మనదే అన్నారు. గోదావరి పుష్కరాల్లో నేనే అభివృద్ధి చేశా. మళ్లీ హామీ ఇస్తున్నా కొవ్వూరు నా సొంత నియోజకవర్గంగా భావించి అభివృద్ధి చేస్తా. మీ బాధ్యత సౌమ్యుడు, న్యాయవాది, సేవ చేయడంలో దిట్ట అయిన కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించండి. రాష్ట్రాన్ని కాపాడుకుందాం. అత్యధిక మెజార్టీ రావాలి. ఈ ఎన్నికలు ఏకపక్షంగా జరగాలని బాబు కోరారు. ఏ ఒక్కరైనా వైసీపీ తరపున పనిచేస్తే మనం కూర్చున్న కొమ్మను మనమే నరుకున్నట్టు అవుతుందన్నారు. పోలవరం నుంచి విజ్జేశ్వరం వరకు గోదావరిలో యంత్రాలతో డ్రెడ్జింగ్ చేసి ఇసుక తోడేయడంతో గామన్ వంతెన కుంగిపోయింది. హోంమంత్రిగా ఆమెకు అధికారాలు లేవుగాని, దోపిడీకి మాత్రం ఫుల్ అధికారాలు ఉన్నాయన్నారు. అత్యాచారాలపై ప్రశ్నిస్తే సాధారణంగా జరుగుతాయని బదులిచ్చిన హోంమంత్రి వనితకు ఆ పదవిలో కొనసాగే అర్హత ఉందా అని ప్రశ్నించారు. దొమ్మేరులో దళిత యువకుడిని అక్రమంగా అరెస్టు చేయడంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో దళితులు తిరగబడడంతో మంత్రి భయపడిపోయి పారిపోయిందన్నారు. కొవ్వూరులో చెత్త గోపాలపురంలో బంగారమా అన్నారు. ఇది న్యాయమా అన్నారు. జగన్మోహనరెడ్డి దీనికి సమాధానం చెప్పాలి. నీ హోంమంత్రి కొవ్వూరులో గెలవకపోతే నిన్ను ఎందుకు గెలిపించాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజల శ్రేయస్సు అవసరం లేదు. ధనార్జనే లక్ష్యం. అటువంటి దుర్మార్గుడు జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ప్రతి ఇంటిలో టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో కలిసి ముందుకు సాగాలి. ఈ రాష్ట్రం కోసమే ఈ పొత్తు అన్నారు. 2022 ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై న్యాయవాదులు గట్టిగా పోరాడుతున్నారు. ఆ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవడం మా ముగ్గురి బాధ్యత కాదు.. మనందరిదీ. కూటమిని గెలిపించండన్నారు. చంద్రబాబు నాయుడికి కొవ్వూరు నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు ఘన స్వాగతం పలికారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు నాగలి, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి గద బహూకరించారు. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడికి చంద్రబాబు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల జంక్షనులో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. జగన్ ఎంతో మోసం చేసి ఏమీ తెలియనట్టు నంగనాచిగా మాట్లాడతాడు. ముందు సిద్ధమన్నాడు. హోర్డింగులు పెట్టాడు. ఒక్కొక్క మీటింగుకు 1500 బస్సులు. ఈ రాష్ట్రం వీళ్ల తాత జాగీరా? గోపాలపురం నుంచే పోలవరం కాలువ పోతోంది. ఈ పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఒక వరం వంటిది. దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టు. 50 లక్షల క్యూసెక్కుల నీళ్లు. ఆ ప్రాజెక్టు ప్రమాదంలో పడితే తూర్పు, పశ్చిమ గోదావరి చాలా భయంకరంగా తయారయ్యే పరిస్థితి వస్తుంది. ఇప్పుడు పోలవరాన్ని జగన్ నాశనం చేశాడు. జగన్ స్వార్థానికి, అవినీతికి పోలవరం బలైపోయింది. నిప్పులాగా బ్రతికాం. జగన్ రాజకీయ కక్షతో బురద వేయడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆకాశంపై ఉమ్మి వేయడానికి చూస్తే అది ఆయన ముఖాన్నే పడుతుందన్నారు. ఎస్సీలకు నేను తీసుకొచ్చిన 27 పథకాల అమలు ఆపేశాడు. నా ఎస్సీలని అంటున్నావ్.. వాళ్లకు మేలు ఏం చేశావని అడుగుతున్నాం. జగన్ దళితులకు ఒక్క కార్యక్రమం కూడా చేయకుండా ద్రోహం చేశాడు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి సైకో. తూర్పుగోదావరిలో ఒక దళిత డ్రైవరును వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చంపి డోర్ డెలివరీ చేశాడా లేదా?.. మాస్కు అడిగిన పాపానికి విశాఖలోని డాక్టర్ సుధాకర్‌ని పిచ్చివాడిని చేసి చంపేశారు. సీతానగరంలో ఇసుక దోపిడీపై ప్రశ్నిస్తే శిరోముండనం చేయించారు. ఎస్సీలను చంపిన వాళ్లను పక్కన పెట్టుకుని ఊరేగుతావా?. అందుకే రంపచోడవరంలో ఆ ఎమ్మెల్సీ వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయబోతే ఎస్సీ కుర్రాళ్లు వచ్చి ఉరికెత్తించారు, తరిమి తరిమి కొట్టారు. అతడిని ప్రోత్సహించింది జగన్. వైసీపీని పాతిపెట్టాలి. ఆ పార్టీని నామ రూపాలు లేకుండా చేసే బాధ్యత మీదే. ఆంధ్రప్రదేశ్ ఆదర్శం కావాలని ఉంది. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచనతోనే మూడు పార్టీలు కలిసి పొత్తు పెట్టుకున్నాం. మమ్మల్ని అర్థం చేసుకొని ఆశీర్వదించండి. నష్ట పోయిన నా తెలుగు జాతిని ఆదుకోవడమే నా ఆలోచన. నాకు వేరే కోరికలేమీ లేవు' అని చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగరాజు, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళీ, గన్ని వీరాంజనేయులు, బొరగం శ్రీను, పితాని సత్యనారాయణ, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సుర్రాజు,బీజేపీ కన్వీనర్ ఫైనం వాసు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టి.వి.రామారావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, నాదెళ్ళ శ్రీరామ్, జి.వి. ప్రసాద్, పరిమి రాధ, బీవీ.ము త్యాలరావు, కాక్లర తులసి, అంద్రు అనిల్, గన్ని హరికృష్ణ, కరుటూరి ధనంజయ్, షేక్ మీరా సాహెబ్, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాసరావు, జమ్ముల సతీష్, గంటా శ్రీను, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో మాట్లాడుతున్న ముప్పిడి.. చిత్రంలో అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు



నల్లజర్లలోనే రాత్రి బస

నారా చంద్రబాబు నాయుడు నల్లజర్లలోనే రాత్రి బస చేశారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్ హాల్‌కి వెళ్లారు. శుక్రవారం ఉదయం ప్రముఖులతో కాన్ఫరెన్స్, సమావేశాలు నిర్వహిస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు నల్లజర్లలోనే ఉంటారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు నల్లజర్ల హెలిపాడ్ నుంచి హెలికాప్టర్‌లో నరసాపురం బయలుదేరివెళతారు.

బాపిరాజుతో మాట్లాడతా..

జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుతో నేను స్వయంగా మాట్లాడతా.. మీరంతా కలిసి కట్టుగా పని చేసి పార్టీని గెలిపించాలి. 2009లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థిగా ,2014లో జడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించా.. బాపిరాజు పార్టీ కోసం బాగా పని చేశాడు. శుక్రవారం మాట్లాడి సమన్వయం చేస్తా. అందరూ కలసి సైకో జగన్‌ను ఓడించి ఫ్యాన్‌ను చిత్తు చిత్తు చేసి డస్ట్‌బిన్‌లో పడేయాలి.



టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీపీని ఆహ్వానిస్తున్న బాబు

రాజకీయ ఓనమాలు నేర్పింది చంద్రబాబే : మద్దిపాటి

అతిసామాన్యమైన దళిత కుటుంబం నుంచి వచ్చా.. చంద్రబాబు రాజకీయ ఓనమాలు నేర్పించి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. చదువుకున్న దళిత యువకులను ప్రోత్సహించి సముచిత స్థానం కల్పించాలని ఆరాటపడే వ్యక్తి చంద్రబాబు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే చంద్రబాబుకు మనమంతా అండగా ఉందాం. సూపర్ సిక్స్ ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. 74 ఏళ్ల వయస్సులో మండే ఎండలను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసం తపించే చంద్రబాబు కోసం మనం ఒక అడుగు ముందుకు వేయాలి. కూటమిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.



గోపాలపురంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకటరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత చిత్రంలో జేసీ, డీఆర్‌వో తదితరులు

సమన్వయంతో పనిచేద్దాం

జిల్లా విభజన ద్వితీయ వార్షికోత్సవంలో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4: తూర్పుగోదావరి జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకువెళ్లడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత అన్నారు. జిల్లా విభజన జరిగి రెండేళ్లు పూర్తిచేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో కేక్ కట్ చేశారు. గత రెండేళ్లుగా తనతో పాటు కలిసి పనిచేసిన అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. కొత్తగా జిల్లా ఏర్పడినప్పుడు మౌలిక సదుపాయాలు, మానవ వనరులు తదితర సమస్యలు ఉన్నా దశల వారీగా వాటిని అధిగమిస్తూ చక్కటి ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా సమన్వయం సాధించడం అత్యంత కీలకమన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు ఇదే విధమైన స్ఫూర్తితో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ చక్కని మార్గదర్శకం ఉంటే జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకొని వెళ్లడం సాధ్యమవుతుందనడానికి కలెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో సాధిస్తున్న పనితీరే నిదర్శనమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు జిల్లాలో బంగారు కొండ అనే కార్యక్రమం వినూత్న ఆలోచనలకు సృజనాత్మకత జోడించి విజయవంతంగా చేపట్టామన్నారు.కార్యక్రమంలో డీఆర్‌వో జి.నరసింహులు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

టీడీపీ అధినేత చంద్రబాబు

నేడు అసంతృప్తి నేతలతో చర్చ

రాజమహేంద్రవరం, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి) : రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటు పురందేశ్వరితో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలను ప్రజలు గెలిపించాలని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. కొవ్వూరులో గురువారం జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. జిల్లా లోక్‌సభ స్థానం బీజేపీ పొత్తులో భాగంగా వెళ్లిందని, రాజానగరం, నిడదవోలు జనసేన పోటీ చేస్తున్నాయన్నారు. మిగిలిన ఐదు స్థానాల్లో అనపర్తి బీజేపీకి ఇచ్చాం.ఇంకా డిసైడ్ కాలేదన్నారు. మిగతా చోట్ల టీడీపీ పోటీ చేస్తుందని కూటమి అభ్యర్థులందరినీ గెలిపించాలని కోరారు. అనపర్తి సీటు కోసం మాజీ ఎమ్మెల్యే నల్లమల్లి రామకృష్ణారెడ్డి పట్టుబట్టడం తెలిసిందే. టీడీపీ మొదటి జాబితాలోనే ఆయన పేరును ఖరారు చేసింది. బీజేపీతో పొత్తు కుదిరాక బీజేపీ అనపర్తి అభ్యర్థిగా శివరామకృష్ణంరాజు పేరు ఖరారు చేసింది. దీంతో రామకృష్ణరెడ్డి ప్రజల్లోకి వెళ్లడంతో ఇక్కడ పునరాలోన చేస్తున్నారు. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుంది. ఇక నల్లజర్లలో శుక్రవారం ఉదయం అసంతృప్తి నేతలతో చంద్రబాబు మాట్లాడే అవకాశం ఉంది.

పెళ్లింట విషాదం

రెప్పపాటులో ప్రమాదం.. ముగ్గురు మృతి

అప్పటి వరకూ ఎంతో ఆనందంగా గడిపారు.. నవదంపతులను నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు.. అనంతరం పెళ్లి కబుర్లు చెప్పుకుంటూ 11 మంది తాము వచ్చిన టాటా ఏస్ వాహనంలోనే వెనుతిరిగి ఇళ్లకు బయలుదేరారు.. రాత్రి పొద్దు పోయే వరకూ పెళ్లి ముచ్చట్లే.. మాట్లాడుతూ.. మాట్లాడుతూ... పెళ్లి జ్ఞాపకాలతో ఎవరికి వారు నిద్రలోకి జారుకున్నారు.. ఉదయానికి ఇల్లు చేరాలన్న కంగారులో డ్రైవర్ ఉన్నాడు.. ఒకే రోజులో వెళ్లి తిరిగి వచ్చే అలసటలో డ్రైవరూ రెప్పవాల్చాడు..మృత్యువు లారీ రూపంలో ఆగి ఉంది. ఆ లారీ కిందకు టాటా ఏస్ దూసుకుపోయింది.. ఆ రెప్పపాటులో ముగ్గురు జీవితాలు గాలిలో కలిసిపోయాయి.. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో పెళ్లింట తీవ్ర విషాదం నింపింది.. దీంతో ఆనందం ఆవిరైంది.. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో తండ్రీ కొడుకు పట్టుకుని మృతిచెందడం చూసి కన్నీటిపర్యంతమయ్యారు.. - వివరాలు8లో



మృత్యువులోనూ తండ్రి వెంటే.. మృతిచెందిన తండ్రీకొడుకు

నేటి నుంచి పురందేశ్వరి పర్యటన

- 8వ తేదీ వరకూ ఇక్కడే

- రేపు పార్టీ కార్యాలయం ప్రారంభం



రాజమహేంద్రవరం, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్ సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి శుక్ర వారం జిల్లాకు రానున్నారు.ఆమె 8వ తేదీ వరకూ జిల్లాలోనే ఉం టారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమల చేరుకుని అక్కడ వేంకటేశ్వరస్వామికి పూజ నిర్వహిస్తారు. 12 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుని వివిధ వర్గాలతో సమావేశమవుతారు. 6వ తేదీన ఉదయం 10.30 గంటలకు పార్లమెంటరీ పార్టీ ఆఫీసును ప్రారంభిస్తారు.ఏవీ అప్పారావు రోడ్డు చివరలో పాత ఎస్పీ ఆఫీసుకు ఎదురుగా 2014లో మాగంటి మురళీమోహన్ ఆఫీసుగా నిర్వహించిన భవనాన్నే పురందేశ్వరి తీసుకున్నారు. దీని ప్రారంభానికి అసెంబ్లీ అభ్యర్థులు, పార్టీ నాయకులు హాజరవుతారు. తర్వాత బీజేపీ కార్యకర్తలతో మాట్లాడతారు. 7వ తేదీన 10.30 గంటలకు రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. 4 గంటలకు రాజమహేంద్రవరం రూరల్ మీటింగ్, 8న ఉదయం 10.30 గంటలకు రాజానగరంలో రాజానగరం అసెంబ్లీ మీటింగ్, సాయంత్రం కొవ్వూరు నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తారు.

కాంగ్రెస్‌తోనే విభజన హామీల అమలు

ఏఐసీసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 4: రాష్ట్ర విభజన హామీలు అమలు కావాలంటే దేశంలోను, రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఏఐసీసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. గురువారం కొవ్వూరు పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, జగన్‌రెడ్డి వాళ్ల స్వార్థం కోసం రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. ఏపీలో 9 గ్యారంటీల హామీలతో తమ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ సెక్యులరిజం, బీజేపీ మతతత్వానికి మధ్య పోటీ అన్నారు. మోదీ ప్రభుత్వానికి మరోసారి అవకాశమిస్తే దేశం తీవ్రంగా నష్టపోతుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, జగన్‌రెడ్డి జైలు, బెయిలు మధ్య ఉన్నారన్నారు. రాహుల్ ప్రధానిగా ప్రమాణం స్వీకారం చేసిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదాపై సంతకం చేస్తారన్నారు. కర్నాటక, తెలంగాణలో వచ్చిన మార్పే ఆంధ్రాలోను వస్తుందన్నారు. విభజనహామీలను తుంగలో తొక్కిన బీజేపీ పదేళ్లలో రాష్ట్రానికి ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేసిన తర్వాత మాత్రమే పోటీచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర పరిశీలకుడు మనోజ్‌చౌహాన్, జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, ఎండీ రఫీయుల్లాబేగ్, ముళ్ల మాధవ్, బోడా వెంకట్, పెద్దిరెడ్డి సుబ్బారావు, గెడ్డం సాయిబాబు, సాయన సుబ్బారావు, చిన్నం మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆంధ్రా షుగర్స్‌లో క్లోరిన్‌పై మాక్ డ్రిల్

కొవ్వూరు, ఏప్రిల్ 4: ప్రమాదకర రసాయనాల తయారీ, రవాణా సమయంలో వినియోగించే అత్యవసర పరికరాలపై కార్మికులకు ఎప్పటికప్పుడు శిక్షణ అందిస్తున్నట్టు ఆంధ్రా షుగర్స్ సేఫ్టీ ఇన్‌చార్జి కేవీవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. కొవ్వూరు ఆంధ్రా షుగర్స్ కార్మాగారంలో క్లోరిన్ రసాయనం లీకైనప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ గురువారం నిర్వహించారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఈ తరహా శిక్షణ వల్ల ప్రమాదాల నియంత్రణ, నష్టాలను తగ్గించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు హెచ్‌ఆర్ ఏజీఎం సీహెచ్‌ఎస్ మహర్షి, ఇంజనీర్లు జె.రఘు, కె.హరనాథ్‌గోపాల్, కెమిస్టు బి.రవితేజ పాల్గొన్నారు.

రైతులు నూతన వంగడాలను సాగు చేయాలి

ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ నరసింహరావు



నల్లజర్లలో ప్రసాద్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నల్లజర్ల, ఏప్రిల్ 4: వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన వరి, అపరాలు, చిరుధాన్యాలలో నూతన వంగడాలను రైతులు కాలనుగుణంగా సాగు చేసుకొని నాణ్యమైన, అధిక దిగుబడులు పొందాలని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, శాస్త్రవేత్తలు అమ్మాజీ, హైమాజ్యోతి సూచించారు. గురువారం నల్లజర్లలో నూతన వంగడాల పండించిన రైతు నిమ్మలపూడి ప్రసాద్ వ్యవసాయ క్షేత్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సార్వా పంటలో ఎంటీయూ 1271, ఎంటీయూ 1293 వంటి రకాలు వేసుకోవాలన్నారు. వేసవిలో జిలుగ వంటి పచ్చిరొట్టను పెంచి ఎరువులు వేసి భూమిని కలియదున్నాలన్నారు. కార్యక్రమంలో రైతులు నిమ్మలపూడి ప్రసాద్, వల్లూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

నిడదవోలు, ఏప్రిల్ 4: నిడదవోలులోని బాలాత్రిపుర సుందరి సహిత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, సంకల్పం, రుద్రాభిషేకాలు, కుంకుమ, గణపతి పూజ, మండపారాధనలు, అంకురార్పణం, ధ్వజారోహణం, బలిహరణలు, వేదా పారాయణం నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రి, అభిరామ్‌శర్మ- స్వామి అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాబోయేది కూటమి ప్రభుత్వమే : దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 4: నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోను అభివృద్ధి చేసి ప్రజలకు మౌళిక వసతులు కల్పించడమే ధ్యేయమని జనసేన-టీడీపీ-బీజేపీల ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నిడదవోలులోని ఎంవీ నగర్ (జ్యోతి కాలనీ)లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయేది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో బూరుగుపల్లి శ్రీనివాస్, రంగా రమేష్, నీలం రామారావు పాల్గొన్నారు. నిడదవోలు మండలం కోరుమామిడిలో కందుల దుర్గేష్ తనయుడు కందుల కృష్ణ తేజ జనచైతన్య యాత్ర నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కలిగించారు.

దాసరి ప్రతిభా రత్న అవార్డుకు శర్మ ఎంపిక



నిడదవోలు, ఏప్రిల్ 4: నిడదవోలుకు చెందిన జ్యోతిష్య శాస్త్ర పరిశోధకుడు, ప్రముఖ సిద్ధాంతి డాక్టర్ మద్దిరాల సత్యవేణు శర్మను దాసరి ఫిల్మ్ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాసరి ప్రతిభారత్న అవార్డుకు ఎంపిక చేసినట్టు అవార్డు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. మే 1న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ ఆవరణలో శర్మను ప్రతిభా రత్న అవార్డుతో సత్కరించనున్నట్టు పేర్కొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం

గోపాలపురం, ఏప్రిల్ 4: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సాయం అందజేశారు. దొండపూడికి చెందిన పదో తరగతి విద్యార్థి గంటాడ శివాని షుగర్ వ్యాధితో బాడీకి ఇన్‌ఫెక్షన్ అయ్యింది, సాగిపాడుకు చెందిన సిర్రా శిరీష థైరాయిడ్ సమస్య కారణంగా ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. ఈ ఇద్దరికీ హెల్పింగ్‌హ్యాండ్స్ సభ్యులు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున గురువారం అందజేశారు. కార్యక్రమంలో వెల్లంకి జయశివసూర్యం, మల్లిపూడి శ్రీనివాస్, హుస్సేన్, మల్లిపూడి దివ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గేష్ విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణమ్మ

పెరవలి, ఏప్రిల్ 4: మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలందరూ కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ విజయానికి కృషి చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఆతికాల రామకృష్ణమ్మ అన్నారు. మండలంలోని మూడు పార్టీల బూత్‌కమిటీ సభ్యులతో పెరవలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యులదే ప్రధాన బాధ్యత అని, ఇప్పటి నుంచి ప్రతీ ఇంటికి వెళ్లి ప్రతి ఓటరును కలిసి ఉమ్మడి మ్యానిఫెస్టోపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను అవినీతి అక్రమాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు పిప్పర రవి, టీడీపీ నాయకులు సలాది కృష్ణమూర్తి, రామాంజనేయులు, సలాది శ్రీహరి, జనసేన నాయకులు నందిప చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు వేలివెన్నులో ఉచిత వైద్య శిబిరం

ఉండ్రాజవరం, మార్చి 4: మండలంలోని వేలివెన్నులోని అయ్యప్పస్వామి మండపంలో ఈనెల 5న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో షుగర్, దంత రోగులకు వైద్య సేవలందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసీపీ పాలనలో ఏ పని జరగలేదు



వైసీపీ నాయకులకు టీడీపీలోకి ఆహ్వానించిన అచ్చిబాబు

- ఎంపీపీ కాకర్ల నారాయుడు.. తెలుగుదేశంలో చేరిక
- టీడీపీలోకి వాడపల్లి, దొమ్మేరు ఎంపీటీసీలు, సర్పంచ్
- డ్రెడ్జింగ్‌తో కార్మికుల ఉపాధికి గండి : అచ్చిబాబు

కొవ్వూరు, ఏప్రిల్ 4: రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) అన్నారు. గురువారం కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడు, వాడపల్లి, దొమ్మేరు ఎంపీటీసీలు ఇంజేటి మౌనిక, వాడవెల్లి సూరిబాబు, వాడపల్లి సర్పంచ్ గెల్లా ప్రసాద్, నారాయుడు అనుచరులు 400 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని అచ్చిబాబు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నారాయుడు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లుగా ఏ ఒక్క పని సాధించలేకపోయానన్నారు. వాడపల్లిలో పేదలకు ఇళ్లస్థలాలు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న నందమూరులో ఇచ్చారని, వాడపల్లిలోనే ఇవ్వాలని కోరగా ఎన్నికల కోడ్ వచ్చేవరకు వాయిదావేస్తూ వస్తారు. వాడపల్లి పరిసర ప్రాంతాల్లో ఇసుక, పడవ కార్మికులు డ్రెజ్జింగ్ వల్ల ఉపాధి కోల్పోయారని, ఉపాధి కల్పించాలని కోరినా ఫలితం లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ రెండింటికి పరిష్కారం చూపించాలని కోరారు. అల్లూరి విక్రమాదిత్య మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. అచ్చిబాబు మాట్లాడుతూ గోదావరి తీరంలో డ్రెడ్జింగ్ చేయడంతో ఇసుక కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. గోదావరి పక్కనే ఉన్నా స్థానికులకు ఇసుక లభించడం లేదన్నారు. గతంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వైఎస్ఆర్ ముందుకు తీసుకెళ్లారని, జగన్ అలా కాదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలకు భూసేకరణలో వైసీపీ నాయకులు రైతుల నుంచి తక్కువ రేటుకు భూములు కొనుగోలు చేసి ప్రభుత్వం నుంచి నాలుగు రెట్లు అదనంగా దోచుకున్నారన్నారు. ప్రజలంతా ఆలోచించి కూటమి అభ్యర్థులకు గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండలాధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, మద్దిపట్ల శివరామకృష్ణ, మారిశెట్టి వెంకటేశ్వరరావు, వాడపల్లి నుంచి తణుకు సూరిబాబు, గెల్లా నాగులు, కుంపట్ల సూర్యనారాయణ, సిరిమల్లి వెంకటేశ్వరావు, దూసనపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

దేవరపల్లి/గోపాలపురం/నల్లజర్ల, ఏప్రిల్ 4: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రజాగళం సభకు రోడ్డు మార్గాన నల్లజర్ల సెంటర్‌కు వస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద మద్దిపాటి వెంకట్రాజు, పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరి నల్లజర్ల జంక్షన్‌కు చేరుకున్నారు. వీరితో పాటు జనసైనికులు, వీరమహిళలు, బీజేపీ శ్రేణులు ఆనందోత్సాహాలతో వెళ్లారు. కార్యక్రమంలో గోపాలపురం, దేవరపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు రొంగలి సత్యనారాయణ, ఆండ్రూ అనీల్, నాయకులు గన్నమని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజీ, సుదురుమాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వేచి ఉన్న మద్దిపాటి తదితరులు



చాగల్లు: మల్లవరం నుంచి బైక్‌లపై ర్యాలీగా కొవ్వూరు వెళ్తున్న దృశ్యం

కొవ్వూరు తరలిన టీడీపీ శ్రేణులు

చాగల్లు, ఏప్రిల్ 4: కొవ్వూరులో జరిగిన చంద్రబాబు ప్రజాగళం సభకు మండలం నుంచి టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్లారు. చాగల్లు, నెలటూరు, మల్లవరం, చంద్రవరం, గౌరిపల్లి, బ్రాహ్మణగూడెం, దారవరం, ఊనగట్ల, చిక్కాల గ్రామాల నుంచి యువకులు బైక్‌లపైన ర్యాలీగా వెళ్లగా మహిళలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో వెళ్లారు. చాగల్లు నుంచి ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలోను, నెలటూరు నుంచి ఈడుపుగంటి మురళి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో వెళ్లారు. కార్యక్రమంలో తాళ్లూరి ప్రసాద్, నందిగం శ్రీను, మల్లవరం సర్పంచ్, ఉపసర్పంచ్‌లు కోడూరి లక్ష్మిసుభాషిణి, కాశి గంగాధరరావు పాల్గొన్నారు.

టీడీపీతోనే నా ప్రయాణం

- ప్రకటన వచ్చే వరకు 'న్యాయం కోసం నల్లమిల్లి' కొనసాగింపు
- రాయవరం యాత్రకు బ్రేక్ : రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 4: తెలుగుదేశం పార్టీతోననే తన ప్రయాణమని అనపర్తి నుంచి పోటీలో నిలిచేది తానేనని, ప్రకటన వచ్చే వరకు న్యాయం కోసం నల్లమిల్లి కొనసాగిస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆళ్ల గోవిందు అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు కోనాల వెంకటరెడ్డి పది రోజులుగా నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. పలు తీర్మానాలు చేశారు. అనంతరం రామవరంలోని నల్లమిల్లి నివాసానికి చేరుకుని తీర్మానంలోని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ అనపర్తిలో పార్టీని నిలుపుకోవాలని, కార్యకర్తలను రక్షించుకోవాలన్నదే తన లక్ష్యమ న్నారు. పార్టీ మార్పు ఆలోచన లేదని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల ప్రకారం అనపర్తి సీటును టీడీపీకే కేటాయిస్తారని, కార్యకర్తలు అధైర్య పడవద్దని అన్నారు. ఇదిలా ఉండగా ముందుగా ప్రకటించిన విధంగా శుక్రవారం నుంచి రాయవరంలో నిర్వహించనున్న న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమం పార్టీ పెద్దలు యనమల రామకృష్ణుడు, కూర్మాపురం అబ్బు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు సూచనల మేరకు వాయిదా వేసినట్టు నల్లమిల్లి తెలిపారు. కాగా కొత్తపేట కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు గురువారం రామకృష్ణారెడ్డిని కలిసి సంఘీభావం ప్రకటించారు. అనపర్తి సీటును చంద్రబాబు నల్లమిల్లికే కేటాయిస్తారన్న నమ్మకం ఉందని ఆయన అన్నారు.



రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న కొత్తపేట కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు

పెళ్లింట విషాదం

- విశాఖ జిల్లా అక్కిరెడ్డిపాలెంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్
- పెళ్లి వేడుక నుంచి వస్తుండగా ప్రమాదం
- మృతుల్లో తండ్రి,కొడుకు



వ్యాన్ నుంచి



ఆనందరావు(ఫైల్)



చంద్రశేఖర్(ఫైల్)



ప్రమాదంలో గాయపడినవారు



చింతాడ ఇందు(ఫైల్)

పెందుర్తి/తాళ్లపూడి ఏప్రిల్ 4: విశాఖపట్నం జిల్లా పెందుర్తి సమీపంలోని అక్కిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారి (నెంబర్ 16)పై గురువారం తెల్లవారు జామున ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొన డంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ నేతృత్వంలో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్ నుంచి క్షతగాత్రులను అత్యంత లాఘవంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామం నుంచి హనుమంతు ఆనందరావు, హనుమంతు చంద్రశేఖర్, చింతాడ ఇందు, అమ్మయ్యమ్మ, బొడ్డేపల్లి జ్యోతి, మెట్ట లక్ష్మి, వెంకటలక్ష్మి, నాగమణి, నీలవేణిలు బుధవారం ఉదయం మినీ వ్యాన్‌లో శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోగన్నపేట పంచాయతీ రంగానాథపేటలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం రాత్రి వివాహ వేడుక ముగిసిన తరువాత శ్రీకాకుళం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. వ్యాన్‌ను వినయ్ డ్రైవ్ చేస్తున్నాడు. పెందుర్తి బైపాస్ రోడ్డులో సరిపల్లి సమీపంలో అక్కిరెడ్డిపాలెం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో వ్యాన్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న హనుమంతు ఆనందరావు (45), హనుమంతు చంద్రశేఖర్ (17), చింతాడ ఇందు (58) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మిగతా వారికి తీవ్రగాయాలయ్యాయి. కాగా మృతుల్లో హనుమంతు ఆనందరావు, చంద్రశేఖర్ తండ్రీకొడుకులు. వీరంతా దశాబ్దం కిందట పనుల కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ఉందని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు.

వైసీపీని కూకటివేళ్లతో పెకలించాలి

జనసేన గోపాలపురం ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు

గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ఏప్రిల్ 4: వేలకోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేసి లక్షల కోట్ల అప్పును ప్రజలపై భారం మోపిన వైసీపీని, జగన్మోహన్‌రెడ్డిని కూకటివేళ్లతో పెకలించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. గోపాలపురంలోని నల్లజర్ల జంక్షన్ వద్ద గురువారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ పదవి మీదున్న ఆకాంక్షతో ఒక్కఛాన్స్ పేరుతో జగన్ ప్రజల నెత్తిన కుచ్చుటోపి పెట్టాడన్నారు. తండ్రి ప్రారంభించిన పోలవరం ప్రాజెక్టును, ఆశయాన్ని తుంగలోకి తొక్కిన దుర్మార్గపు ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరాన్ని కలల సౌధం అమరావతిని నిట్టనిలువునా ముంచేశాడన్నారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి, మద్యంతో వేల కోట్ల రూపాయలు కూడగట్టుకున్నారని అన్నారు. ధనదాహం, అధికార దుర్వినియోగం తప్ప జగన్మోహన్‌రెడ్డికి మరేమి తెలియదన్నారు. దళితులను రాష్ట్ర వ్యాప్తంగా 180మందికి పైగా పొట్టన పెట్టుకున్నారని అన్నారు. బెస్ట్ అవెలబుల్ స్కూల్స్, అంబేద్కర్ విదేశి విద్య సబ్‌ప్లాన్ నిధులు వంటి వాటిని దళితులకు దూరం చేశారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న వైసీపీ విధ్వంసకర పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని సువర్ణరాజు అన్నారు. సభలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం



జాతర ప్రారంభ పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

చాగల్లు, ఏప్రిల్ 4: మీనానగరం గ్రామదేవత శ్రీముత్యాలమ్మ జాతర వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని నడివీధిలోనికి బ్యాండు వాయిద్యాలతో తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. అమ్మవారికి ప్రతి ఆదివారం ప్రత్యేక పూజలు జరుగుతాయని, మేనెల 3, 4, 5 తేదీల్లో జాతర నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కొత్తపల్లి అగ్రహారం మాజీ సర్పంచ్ మృతి

పెరవలి, ఏప్రిల్ 4: కొత్తపల్లి అగ్రహారం మాజీ సర్పంచ్ ఏలూరు గంగరాజు గురువారం మృతి చెందారు. ఆయన 1994-2000లో సర్పంచ్‌గా పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన మృతి పట్ల గ్రామ ప్రముఖులు మారిశెట్టి పోతురాజు, బండారు సాయిబాబా నివాళులర్పించారు.

80 శాతం పింఛన్లు పంపిణీ

ఉండ్రాజవరం, మార్చి 4: మండలంలో 80శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో నరేంద్ర రెడ్డి గురువారం తెలిపారు. బుధ, గురువారాల్లో సచివాలయాల వద్ద సిబ్బందితో లబ్ధిదారులకు అందజేశామని, శుక్రవారం దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారని చెప్పారు.

పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి

రాజమహేంద్రవరం ఆర్‌వో దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 4: మాస్టర్ ట్రైనీలు తమకు కేటాయించిన అంశాలపై అవగాహన తెచ్చుకుని పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని 50- రాజమహేంద్రవరం ఆర్‌వో దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం మాస్టర్ ట్రైనీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు మాక్‌పోల్ ఎలా నిర్వహించాలి, ఈవీఎంలు ఎలా సిద్ధం చేయాలి, ఎన్నికల నిర్వహణ రిపోర్టు ఫారాలు ఎలా నింపాలి, వాటిని ఏఏ ప్యాకెట్లలో పెట్టాలో శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ సమయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ల తప్పులను సరిదిద్దాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలన్నారు. ఈవీఎంలు వీవీ పాట్‌లు ఎలా ఉపయోగించాలో తెలియజేయాలని, ప్రతిఒక్కరికి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ల అనుసంధానం చేయడం నేర్పాలన్నారు. పూర్తిగా నేర్చుకుంటే పోలింగ్ జరిగే రోజు పొరపాట్లకు ఆస్కారం వుండదన్నారు. సమావేశంలో తహశీల్దార్ ఆంజనేయులు, సిటీ అసెంబ్లీ మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

వైభవంగా శివకేశవులు కల్యాణోత్సవం

రాజానగరం, ఏప్రిల్ 4: పాల్గుణ బహుళ ఏకాదశి సందర్భంగా రాజానగరంలో శ్రీరాజలింగేశ్వర, శ్రీరాజగోపాల స్వామి కల్యాణోత్సవం గురువారం కన్నుల పండువుగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వైసీపీ కన్వీనర్ దూలం పెద్ద దంపతులు, స్థానిక వ్యాపారవేత్త డీవీబీ వసంతకుమార్ దంపతులు చేతుల మీదుగా ఆలయార్చకులు వైభవోపేతంగా కల్యాణం జరిపించారు. ఈవో రాంబాబురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ పీవోకు రామారావు అవార్డు

రాజానగరం, ఏప్రిల్ 4: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో, లైబ్రరీ ఆఫీసర్ షేక్ మీరాకు పడాల రామారావు స్మారక పురస్కారం లభించింది. స్వతంత్ర సమరయోధుడు, శతాధిక గ్రంథ కర్త, పడాల రామారావు 18వ స్మారకోత్సవం సందర్భంగా గోదావరి జిల్లా శాఖ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామిరెడ్డి, డాక్టర్ గంగిరెడ్డి చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రన్, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం మీరాను అభినందించారు.

గ్రంథకర్త సుబ్బారావుకు వీసీ అభినందనలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 4: ఆదికవి నన్నయ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, కొయ్యలమూడి రాధ రచించిన ది ఫిలాసఫీ ఆఫ్ అడ్జస్ట్‌మెంట్, యాంగ్జయిటీ అండ్ అకడమిక్ అచీవ్‌మెంట్ పుస్తకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సుబ్బారావు మాధ్యమిక పాఠశాలల్లోని విద్యార్థుల సర్దుబాటు వ్యాకులత, వార్షిక ప్రగతి ఏవిధంగా ఉంటుందో ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రర్ ఆచార్య జి.సుధాకర్, అకడమిక్ డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలి

గోకవరంలో రైతుల ఆందోళన.. తహశీల్దార్‌కు వినతి



గోకవరం, ఏప్రిల్ 4: సన్నరకం (ఆర్ ఎన్ఆర్) పంటకు పూర్తి మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ మండలంలోని పలువురు రైతులు గురువారం గోకవరంలో ఆందోళనకు దిగారు. పాతబస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై బైఠాయింపు, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు చింతల రామకృష్ణ మాట్లాడుతూ ఈ సీజన్‌లో మండలంలోని అధిక రైతులు ఆర్ఎన్ఆర్ రకం పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశామన్నారు. మిల్లర్లు కుమ్మక్కై ధాన్యం రేటు రూ.2 వేలు నుంచి రూ.1500కు కుదించి రైతుల నడ్డి విరిచారన్నారు. మార్కెట్లో ఆర్ఎన్ఆర్ బియ్యం 25 కిలోలు రూ.1650 ధర పలుకుతుండగా 75 కిలోల ధాన్యాన్ని మాత్రం రూ.1500కు కొనుగోలు చేయడం దారుణమని, ఈ విషయంలో అధికారులు కూడా పూర్తి నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం బాధిత రైతులు ర్యాలీగా రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకొని ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. తదుపరి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో రైతులు గండికోటి శ్రీధర్, రాయవరపు అప్పారావు, అలబండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత'తో రైతుకు రూ.20 వేలు అందిస్తాం

గోకవరం, ఏప్రిల్4: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు అన్నదాత పథకం ద్వారా రూ.20,000 అందజేస్తామని టీడీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కోడలు లక్ష్మీదేవి, ఆమె తనయుడు ఆనీష్ నెహ్రూ హామీ ఇచ్చారు. మండలంలోని వెదురుపాకలో గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

గోకవరం, ఏప్రిల్4: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యపడుతుందని విశ్వ హిందూ పరిషత్ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ గురువారం గోకవరం చేరుకొని శ్రీనివాసరావును బీజేపీలోకి ఆహ్వానించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు ప్రకటించారు. హిందూ దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా తాను పని చేస్తున్నానన్నారు. ఇప్పటికీ ఆలయాల అభివృద్ధికి సుమారు రూ.2.50 కోట్ల వెచ్చించినట్టు తెలిపారు. అలాగే ఇబ్బందుల్లో ఉన్నవారికి ఆర్థిక సాయం అందిస్తున్నాట్టు చెప్పారు. కార్యక్రమంలో మట్టా మంగరాజు, దాట్ల కృష్ణవర్మ, సత్తి వెంకటరెడ్డి, ఇనగోటి బాపన్నదొర, బత్తుల వెంకన్నబాబు, కోన సురేష్ పాల్గొన్నారు.

12 మంది వలంటీర్లు రాజీనామా

దేవరపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని త్యాజంపూడి, దుద్దుకూరు గ్రామాలకు చెందిన 12మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. మండలంలోని త్యాజంపూడికి చెందిన 9మంది, దుద్దుకూరుకు చెందిన ముగ్గురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో కృష్ణంరాజుకు అందజేశారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి